
FOR ADS.......
ఆకాంక్ష
CONTACT:
8333818121

తొలి ఆకాంక్ష
తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో
భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట,
జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
ఆకాంక్ష

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :180 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజీలు : 08, వెల. 5రూ/ శుక్రవారం- 20 - ఫిబ్రవరి - 2026

## క్షమాపణలు కోరి లెంప లేసుకుంటేనే వైఎస్సార్సీపీకి తిరుమల పేరెత్తే అర్హత‘




మండలిలో క్షమాపణలు కోరి లెంప లేసుకుంటేనే వైసీపీకి తిరుమల పేరెత్తే అర్హత

వైఎస్సార్సీపీ సభ్యులు క్షమాపణ చెప్పాకే కల్తీ లడ్డూ వ్యవహారంపై మేము చర్చిస్తాం

అసెంబ్లీ లాబీలో మీడియాతో మంత్రులు చిట్‌చాట్

అమరావతి : వైఎస్సార్సీపీ సభ్యులు క్షమాపణ చెప్పాకే కల్తీ లడ్డూ వ్యవహారంపై తాము చర్చిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. శాసన మండలిలో క్షమాపణలు కోరి లెంప లేసుకుంటేనే వైఎస్సార్సీపీకి తిరుమల పేరెత్తే అర్హత ఉందని చెప్పారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో మిగతా..2లో

## ఈ నెల 25 నుంచి ఇంటర్ పరీక్షలు - రిజిస్టర్ మొబైల్ నంబర్‌కు హాల్‌టికెట్లు



ఇంటర్ హాల్ టికెట్లు విడుదల

తొలిసారిగా విద్యార్థుల రిజిస్టర్ మొబైల్ నంబర్‌కు హాల్‌టికెట్లు పంపిన ఇంటర్ బోర్డు

ఈ నెల 25 నుంచి ఇంటర్ పరీక్షలు

హైదరాబాద్: : తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 25న ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ వార్షిక పరీక్షలకు హాల్ టికెట్లు విడుదల చేశారు. తొలిసారిగా విద్యార్థుల రిజిస్టర్ మొబైల్ నంబర్ కు ఇంటర్మీడియట్ బోర్డు హాల్ టికెట్లు పంపింది. రిజిస్టర్ మొబైల్ నెంబర్ నుంచి మిగతా..2లో

### బీఆర్ఎస్ నేతలను వేధిస్తే ఊరుకోం..

## తగిన మూల్యం తప్పదు



2

- బాల్క సుమన్ అరెస్ట్ దుర్మార్గపు చర్య అని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు.
- కాంగ్రెస్ నేతలే పథకం ప్రకారం దాడి చేసి అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు..

### ఈ నెల 26 నుంచి

## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

- ఈ నెల 23న కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం
- ఈనెల 26 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉండే అవకాశం
- 10-15 రోజులు బడ్జెట్ సమావేశాలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం



హైదరాబాద్: ఈ నెల 26 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాల విశ్వసనీయ సమాచారం. దానిపై ఈనెల 23న జరగబోయే కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 28న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశాలు దాదాపు 10 నుంచి 15 రోజులు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. రసవత్తరంగా బడ్జెట్ సమావేశాలు : ఈసారి బడ్జెట్ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయం మరింత ఆసక్తిగా ఉండనుంది. ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ ఎస్ , బీజేపీలు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని చూస్తున్నాయి. 6 గ్యారెంటీల అమలు 13 అంశాల హామీలపై తదితర రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి ప్రాజెక్టులు, యూరియా కొరత, ఉద్యోగ నియామకాలు, హిల్ట్ పాలసీ వంటి సమస్యలపై అసెంబ్లీ వేదికగా గళమెత్తనున్నట్లు తెలుస్తోంది. ప్రతిపక్షాల దాడిని సమర్థవంతంగా ఎదుర్కోవాలనే అంశాలపై కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈసారి బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్షనేత, మాజీ సీఎం కేసీఆర్ వస్తారా? లేదా అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. ఒకవేళ కేసీఆర్ బడ్జెట్ సమావేశాలకు హాజరైతే మరింత ఇంట్రెస్టింగ్ గా ఉండే అవకాశం ఉంది. మిగతా..2లో

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి

## కేటీఆర్ బహిరంగ లేఖ

రాబోయే బడ్జెట్‌లో హామీల అమలుకు నిధులు కేటాయించాలని డిమాండ్

ఆరు గ్యారెంటీలు సహా 95 శాతం హామీలు పెండింగ్‌లో ఉన్నాయని విమర్శ

నిధులు కేటాయించకపోతే ప్రజలతో కలిసి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరిక

గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలన్న బీఆర్ఎస్



2లో

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సగం పదవీకాలం పూర్తికావస్తున్న తరుణంలో, ఇచ్చిన హామీల అమలుకు రాబోయే బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురువారం బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలు,

### తెలంగాణ నేతలు బాగా పనిచేస్తున్నారు..

## రాహుల్, ఖర్గే కితాబు..



2

- కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ పనితీరుపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు.
- ఏఐసీసీ నేతలు ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు.
- సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయం తెలుసుకోవాలని రాహుల్‌గాంధీ సూచించారు..

### ఏఐ రంగంలో భారత్ కీలక పాత్ర‘- సమ్మిట్‌లో

## యూఎన్ చీఫ్, టెక్ దిగ్గజాల ప్రసంగం

- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో పాల్గొన్న యూఎన్ చీఫ్ గుటెరెస్, టెక్ దిగ్గజాలు
- ఈ క్రమంలో ఏఐ రంగంలో భారత్ పాత్రపై ఆసక్తికర వ్యాఖ్యలు



ఢిల్లి : ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూఎన్ చీఫ్ ఆంటోనియో గుటెరస్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తదితర టెక్ దిగ్గజాలు కీలక ప్రసంగం చేశారు. ఏఐ రంగంలో భారత్ పాత్ర గురించి వ్యాఖ్యానించారు. భారత్‌లో తమ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతోందని, అందులో భాగంగా పూర్తి స్థాయి ఏఐ హబ్‌ను ఏర్పాటు చేస్తోందని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ స్పష్టం చేశారు. అలాగే దేశంలోని ప్రతి పౌరుడికి ఏఐ టూల్స్ చేరేలా చేయడమే తమ లక్ష్యమని టీసీఎస్ ఛైర్మన్ చంద్రశేఖరన్ ప్రకటించారు.

### ఏఐ భవిష్యత్ ను కొందరు నిర్ణయించలేరు: యూఎన్ చీఫ్

ఈ సదస్సుకు తనను ఆహ్వానించిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్. ఈ క్రమంలో గ్లోబల్ సౌత్‌లో మొదటి ఏఐ సమ్మిట్‌ను నిర్వహిస్తున్న భారత్‌కు అభినందనలు తెలియజేశారు. మిగతా..2లో

## బ్లాక్ బాక్స్ కాదు గ్లాస్ బాక్స్ విధానం కావాలి‘

## వినియోగానికి మోదీ 3సూచనలు

ఏఐ నైతిక వినియోగానికి సమగ్ర రోడ్ మ్యాప్ ను రూపొందించాల్సిన అవసరం ఉందన్న మోదీ



2లో..

ఢిల్లి : ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ లో అనైతిక ప్రవర్తనకు అవకాశం అపరిమితంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అందుకోసమే ఏఐ వినియోగానికి సమగ్ర రోడ్ మ్యాప్ ను రూపొందించాల్సిన అవసరం ఉందని మోదీ అభిప్రాయపడ్డారు. మానవ విలువలు, సరైన మార్గ దర్శకత్వం లేకుండా సాంకేతికతను ఉప యోగిస్తే అది స్వీయ విధ్వంసకరంగా మారవచ్చని హెచ్చరించారు. అందుకే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కు తప్పనిసరిగా మానవ విలువలు, స్పష్టమైన దిశ ఉండాలని చెప్పారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సు 2026లో భాగంగా నిర్వహించిన లీడర్స్ ప్లీనరీలో ప్రధాని మోదీ ప్రసంగించారు. డేటా సార్వభౌ మత్వాన్ని గౌరవించడం సహా పారదర్శక భద్రతా నియమాలను రూపొం దించాలని సూచించారు. “భారత్ బుద్ధుడు జన్మించిన దేశం. సరైన ఉద్దేశం ఉంటేనే సరైన నిర్ణయాలు ఉంటాయని బుద్ధుడు చెప్పారు. అందుకోసమే అందరూ కలిసి ఏఐని సరిగ్గా వినియోగించుకునేందుకు సమగ్రమైన రోడ్ మ్యాప్ ను రూపొం దించాల్సిన అవసరం ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ను

### వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు రాజధానిలో

## ప్రధాన రహదారుల పనులు పూర్తి



2

- వచ్చే వ్యవసాయ సీజన్ నాటికి పెండింగ్ లో ఉన్న 46 వేల విద్యుత్ కనెక్షన్లు మంజూరు
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో డిస్కంలు, ఉచిత వ్యవసాయ కనెక్షన్ల కోసం రూ. 839.44 కోట్లు ఖర్చు

అమరావతి : రాజధానిలోని ప్రధాన రహదారులు (ట్రంక్ రోడ్లు) ఏప్రిల్ 2027కి పూర్తి చేసేందుకు

### మంత్రులు, ఐఏఎస్‌ల బండారం

# అంతా బయట పెడతా..

ఒవైసీ కళ్లలో ఆనందం కోసం సీఎం రేవంత్ రెడ్డి జీహెచ్ఎంసీ విభజన చేశారని బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.



హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి (దీప్తి) వ్యతిరేకంగా కాంగ్రెస్ బీఆర్ఎస్ కలిసి పని చేశాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసిన కరీంనగర్ ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్ చెంప చెళ్లు మనిపించారన్నారు. సీఎం స్థాయి వ్యక్తులు కరీంనగర్ కార్పొరేషన్‌లో కుట్రలు చేశారని.. సభ్యులకు బ్లాంక్ చెక్కులు, కార్లు ఆఫర్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పెద్దలు, బీఆర్ఎస్ పెద్దలు ఈ కుట్రలో భాగమయ్యారని ధ్వజమెత్తారు. ఇవాళ కరీంనగర్ కార్పొరేషన్‌కు చెందిన 10 డివిజన్ కార్పొరేటర్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో స్టేట్ చీఫ్ రామచంద్రరావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు.

### ఒవైసీ కళ్లలో ఆనందం కోసమే:

ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా, అఖిలపక్షం మీటింగ్ లేకుండా, ప్రజాప్రతినిధుల అభిప్రాయం

### ఏపీ బడ్జెట్ అబద్ధాలు, తప్పుడు లెక్కలమయం

## అని జగన్ విమర్శ

- సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారని ప్రభుత్వంపై ఆరోపణ
- రాష్ట్ర ఆదాయం బాబు అండ్ కో జేబుల్లోకి వెళుతోందని ఘాటు వ్యాఖ్యలు
- సొంత ఆదాయాల వృద్ధిలో ఏపీ 22వ స్థానంలో ఉందని వెల్లడి
- నారా లోకేశ్ పైనా తీవ్ర స్థాయిలో జగన్ ధ్వజం



అమరావతి : వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇది ప్రజల బడ్జెట్ కాదని, కేవలం చంద్రబాబు భజన, తప్పుడు లెక్కలతో మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## మంత్రులు, ఐపీఎస్‌ల బండారం అంతా బయట పెడతా..

లేకుండా ఏకపక్షంగా జీహెచ్ఎంసీని విభజించడం సిగ్గు చేటని బండి సంజయ్ ఫైర్ అయ్యారు. జీహెచ్ఎంసీని మూడు ముక్కలు ఎందుకు చేశారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. జీహెచ్ఎంసీలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉందని, బీజేపీకి భయపడే హిందూ సమాజ ఓట్లను చీల్చడానికే జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేశారన్నారు. కోటిన్నర జనాభా, 40 వేల కోట్ల బడ్జెట్ కలిగిన ముంబై కార్పొరేషన్ ను విభజించలేదని రెండు కోట్ల జనాభా కలిగిన ఢిల్లీని, చెన్నై కార్పొరేషన్ ను చీల్చలేదు... మరి జీహెచ్ఎంసీని ఎందుకు ముక్కలు చేశారని ప్రశ్నించారు. ఒవైసీ కళ్లల్లో ఆనందం చూడటం కోసం సీఎం రేవంత్ రెడ్డి జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేశారని ఆరోపించారు.

ఆ డబ్బులన్ని ఎటుపోయాయి?

రెండేళ్ల పాలనలో జీహెచ్ఎంసీ పరిధిలో తట్ట మొరం పోసిన దాఖలాల్లేవని భాగ్యనగర్ ప్రజలంతా తిరగబడే రోజులు రాబోతున్నాయన్నారు. తెలంగాణ రైజింగ్ పేరుతో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు కదా? ఆ డబ్బులన్నీ ఎటుపోయాయి? ఎంత మందికి ఉద్యోగాలిచ్చారు? ఎన్ని యూనిట్లు ప్రారంభించారు? సమాధానం చెప్పాలన్నారు. దావోస్ కు రెండు సార్లు వెళ్లి రూ.2.15 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు.. ఇప్పటి వరకు ఎన్ని పెట్టుబడులు వచ్చాయి? ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయని ప్రశ్నించారు.

టీపీసీసీ కాదు.. టీ4సీ:

ఇది టీపీసీసీ కాదని టీ4సీ (తెలంగాణ కరప్షన్, కమీషన్, కలెక్షన్, కాంగ్రెస్)అని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. భాగ్యనగర్‌లో కాంగ్రెస్‌ను మూసీ నదిలో పడేయడం ఖాయం అన్నారు. దిమ్మతిరిగే విధంగా కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పబోతున్నారని భాగ్యనగర్ ప్రజలారా....ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను రెండేళ్లలో చేసిందేమిటో చెప్పాలని నిలదీయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు మూటలు అప్పగించడానికే పరిమితమవుతున్నారే తప్ప తెలంగాణకు చేసిందేమిటో చెప్పాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బెన్ ఫిట్స్ ఇవ్వకుండా వారి ఉసురు తీసుకుంటున్నారని ఇదేమిటని ప్రశ్నిస్తున్న వృద్ధులను జైల్లో వేయడానికి సిగ్గు లేదా? అని మండిపడ్డారు.

## ఏపీని టెక్నాలజీ హబ్‌గా మార్చే లక్ష్యంతో
# సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన

పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు యూనిసీసీ సంస్థతో కలిసి 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీ సంస్థతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్యూటర్ కోసం ఐఐటీ మద్రాస్‌తోనూ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకోనుంది. ప్రముఖ టెక్ సంస్థ ఎన్విడియా భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై కూడా ఈ సదస్సులో కీలక ప్రకటన చేయనున్నారు. రేపు ఉదయం 9:30 గంటలకు జరిగే ప్లీనరీ సెషన్‌లో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద, టీసీఎస్ ప్రతినిధులతో కలిసి చంద్రబాబు ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరం) నిర్వహించే రౌండ్‌టేబుల్ సమావేశంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, డబ్ల్యూఈఎఫ్ సీఈఓ బోర్కే బ్రెండేతో కలిసి కృత్రిమ మేధస్సు అంశంపై చర్చిస్తారు. ఈ పర్యటనలో భాగంగా యునైటెడ్ కింగ్‌డమ్ ప్రతినిధి బృందంతో పాటు అరామ్కో, అడోబ్, ఆటోడెస్క్ వంటి కంపెనీల అధిపతులతోనూ ముఖ్యమంత్రి విడివిడిగా సమావేశమై రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంపై చర్చలు జరుపుతారు.

## ఈ నెల 26 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

3 లక్షల కోట్లతో గతేడాది బడ్జెట్ : 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3,04,965 కోట్ల అంచనా వ్యయంతో కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది పూర్తిస్థాయి బడ్జెట్ ను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఆ బడ్జెట్ లో సంక్షేమ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆర్థిక మంత్రి భట్టి తెలిపారు. ఆరు గ్యారంటీలకు సుమారు రూ.56,084 కోట్లను కేటాయించారు. రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా వెల్లడించారు. రాష్ట్రం రుణాలు రూ.5,04,814 కోట్లుగా ఉన్నాయని తెలిపారు. శాసనసభలో బడ్జెట్ పై భట్టి విక్రమార్క 1.43 గంటల పాటు ప్రసంగించిన సంగతి తెలిసిందే. మార్పు తెచ్చేలా మా పాలన : గత బీఆర్ ఎస్ ప్రభుత్వ పాలనలో ధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని, తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిరంతరం పనిచేస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ప్రజలకు నిజాలు చెప్పకపోతే స్వార్థపరులు చెప్పేవే నిజమని అనుకుంటారని, మార్పు తెచ్చేలా బాధ్యతాయుత పాలన అందిస్తామని తెలిపారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

420 హామీల అమలుకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లోనైనా చిత్తశుద్ధి చూపాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన హెచ్చరించారు. ఆరు గ్యారెంటీల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, వాటి అమలును పూర్తిగా పక్కన పెట్టిందని కేటీఆర్ తన లేఖలో విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో 95 శాతం ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని ఆరోపించారు. గత రెండు బడ్జెట్లలోనూ హామీల అమలుకు అవసరమైన కేటాయింపులు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో 2026-27 బడ్జెట్‌లో అయినా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, యువత, రైతుల కోసం ఇచ్చిన హామీల మేరకు భారీగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఓపిక నశిస్తోందని, వారిని ఇకపై వేచి చూసేలా చేయవద్దని సూచించారు. కేవలం గ్యారెంటీలే కాకుండా, ఎన్నికలకు ముందు వివిధ డిక్లరేషన్ల రూపంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు ఇచ్చిన వాగ్దానాలను కూడా ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కేటీఆర్ కోరారు. గత రెండేళ్లుగా ఆయా వర్గాలకు చెల్లించాల్సిన నిధులు, బకాయిలను ఈ బడ్జెట్‌లో చేర్చి వెంటనే విడుదల చేయాలని స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ నేతలను వేధిస్తే ఊరుకోం..
# తగిన మూల్యం తప్పదు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యలు చేశారు. గురువారం జిల్లా జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను హరీశ్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాల్క సుమన్ అరెస్ట్ దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలే పథకం ప్రకారం దాడి చేసి బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టించారని ఆరోపించారు. బలం లేని చోట కాంగ్రెస్ ఎలా గెలుస్తుందో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి తీరు జుగుప్సాకరంగా ఉందని హరీశ్ విమర్శించారు. క్యాతనపల్లిలో మహిళా కౌన్సిలర్లపై దాడి జరిగితే పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదని.. బీఆర్ఎస్ నేతల వాహనాలు ధ్వంసమైనా ఫిర్యాదు తీసుకోలేదని మండిపడ్డారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టింగ్‌ల కోసం బీఆర్ఎస్ నేతలను వేధిస్తే ఊరుకునేది లేదని.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక తగిన మూల్యం చెల్లించుకుంటారని పోలీసులను మాజీ మంత్రి హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల తిరుగుబాటు మొదలైందన్నారు. 'రాహుల్ గాంధీ.. మీ రాజ్యాంగం ఏమైందో చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

## తెలంగాణ నేతలు బాగా పనిచేస్తున్నారు..
# రాహుల్, ఖర్గే కితాబు..

ఢిల్లీ, ఫిబ్రవరి 19 : కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ పనితీరుపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే , కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాల అమలుతీరును అడిగి ఏఐసీసీ నేతలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయం తెలుసుకోవాలని రాహుల్‌గాంధీ సూచించారు. వరి ధాన్యం సాగు, కొనుగోలుకు సంబంధించిన విషయాలపై రాహుల్, ఖర్గే ప్రత్యేకంగా ఆరా తీశారు. తెలంగాణలో ఆయిల్ ఫాం పంటను ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతు సంక్షేమం విషయంలో కాంప్రమైజ్ కావొద్దని ఏఐసీసీ నేతలు సూచించారు. పార్టీని బలోపేతం చేయాలని రాహుల్ దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు చాలా బాగున్నాయని ఏఐసీసీ నేతలు ప్రశంసించారు. గ్రేటర్ ఎన్నికలు ముందు జరపాలా..? లేదా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ముందు జరపాలా? అనే అంశం క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోవాలనే అభిప్రాయానికి నేతలు వచ్చారు. శాఖల వారీగా మంత్రుల నిర్ణయాలని రాహుల్ గాంధీ అడిగి తెలుసుకున్నారు.

## ఈ నెల 25 నుంచి ఇంటర్ పరీక్షలు
## - రిజిస్టర్ మొబైల్ నంబర్‌కు హాల్‌టికెట్లు

వీటిని డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించింది. కళాశాల ప్రిన్సిపల్స్ నుంచి కూడా హాల్ టికెట్లు తీసుకునే అవకాశం కల్పించారు. 9.9 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. కళాశాలల యాజమాన్యాల బెదిరింపుల నుంచి విముక్తి : ప్రస్తుతం ఆయా ఇంటర్ బోర్డు హాల్‌టికెట్లను విద్యార్థుల రిజిస్టర్ మొబైల్ నంబర్ కు పంపింది. గత కొన్ని సంవత్సరాలుగా పరీక్షలకు కొద్ది రోజుల ముందు వెబ్‌సైట్లో కూడా పెడుతున్నాయి. కొంతమంది హాల్‌టికెట్లు తీసుకుంటారు. ఫీజు బకాయిలు ఉన్న విద్యార్థులు వాటిని పొందలేకపోతున్నారు. దీంతో పరీక్షా కేంద్రం ఎక్కడ ఉందో తెలియక వారు సతమతమవుతుంటారు. ఫీజు మొత్తం చెల్లిస్తేనే హాల్‌టికెట్లు ఇస్తామని విద్యార్థులను చాలా వరకు కళాశాలల యాజమాన్యాలు బెదిరిస్తుంటారు. అసలే పరీక్షల టెన్షన్ మరో వైపు హాల్‌టికెట్లు ఇవ్వరేమో, పరీక్షలు రాయలేకపోతానేమోనని విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతుంటారు. ఇలాంటి పరిస్థితికి చెక్ పెట్టేందుకే ఇంటర్మీడియట్ ప్రత్యామ్నాయ మార్గంగా హాల్‌టికెట్లను విద్యార్థులకు పంపింది. ఫిబ్రవరి 25 తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25 తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.

## ఏపీ బడ్జెట్ అబద్ధాలు, తప్పుడు
# లెక్కలమయం అని జగన్ విమర్శ

మొదటి పేజి తరువాయి

నిండిన మోసపూరిత పత్రమని ఆయన అభివర్ణించారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వ తీరును ఎండగట్టారు. "మోసానికి షర్టు, ప్యాంటు వేస్తే అది చంద్రబాబే. అబద్ధానికి రెక్కలు కడితే అది కూడా చంద్రబాబే" అంటూ జగన్ ఘాటు వ్యాఖ్యలతో ప్రసంగాన్ని ప్రారంభించారు. చంద్రబాబు పాలన "పబ్లిసిటీ పీక్.. పర్ఫామెన్స్ వీక్" అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఊదరగొట్టిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలను మూడు బడ్జెట్‌లలోనూ గాలికి వదిలేసి అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు. ఆర్థిక లెక్కలన్నీ తప్పుల తడకలేనని జగన్ అంకెలతో సహా వివరించారు. 2024-25లో రూ.1.19 లక్షల కోట్ల ఆదాయం వస్తుందని చెప్పి, వాస్తవానికి రూ.94,937 కోట్లు మాత్రమే రాబట్టారని తెలిపారు. పది నెలల్లో రాష్ట్ర ఆదాయ వృద్ధి కేవలం 4.25 శాతమేనని పేర్కొన్నారు. కాగ్ రిపోర్ట్ ప్రకారం, దేశంలోని 23 రాష్ట్రాల్లో సొంత ఆదాయాల పురోగతిలో ఏపీ చివరి నుంచి రెండో స్థానంలో (22వ ర్యాంక్) ఉందని, ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో 2026-27 నాటికి ఆదాయం 45% పెరుగుతుందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వ అసమర్థత వల్లే రాష్ట్ర ఆదాయం 'బాబు అండ్ కో' జేబుల్లోకి వెళ్తోందని, "దోచుకో.. దాచుకో.. పంచుకో" అనే విధానం అమలవుతోందని జగన్ ఆరోపించారు. అప్పుల వివరాలను బడ్జెట్‌లో చూపించకపోవడం పారదర్శకత లేకపోవడానికి నిదర్శనమన్నారు. మహిళలకు రూ.1,500, నిరుద్యోగ భృతి వంటి హామీలకు నిధుల కేటాయింపు ఏదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజల డబ్బుతో కొలంబో, ఢిల్లీ అంటూ విమానాల్లో తిరుగుతూ క్రికెట్ మ్యాచ్ లు చూస్తూ, స్టేడియాల్లో జల్సాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. "రాత్రికి కొలంబోలో ఉంటాడు, మరుసటి రోజు ఉదయం విజయవాడలో ఉంటాడు... సాయంత్రానికి ఢిల్లీ వెళతాడు... అంతా ప్రైవేటు విమానాలే. దేశంలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు ఇలా జల్సాలు చేయడం ఎక్కడైనా ఉందా? చంద్రబాబుకు ఒక విమానం, లోకేశ్ కు ఒక విమానం, పవన్ కల్యాణ్ కు ఓ విమానం... అందరూ గాల్లోనే ఉంటారు. క్రికెట్ మ్యాచ్ చూడాలంటే కొలంబోనే వెళ్లాలా... టీవీలో చూస్తే కనపడదా... నేను కూడా టీవీలోనే చూశాను" అంటూ జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

## వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు రాజధానిలో ప్రధాన రహదారుల పనులు పూర్తి

మొదటి పేజి తరువాయి

ప్రణాళిక చేశామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. శాసనసభలో అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డుపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. ఇన్నర్ రింగ్ రోడ్డులో 96.2. కి.మీ పొడవు, 75 మీటర్ల వెడల్పుతో 8+4 వరసల రోడ్డు నిర్మాణానికి డిజైన్ చేశామని మంత్రి తెలిపారు. దీని నిర్మాణం రెండు ఫేజ్ లలో జరుగుతుందని, అది పీపీపీ విధానంలో చేపట్టినట్లు తెలిపారు. రాజధానిలోని ట్రంక్ రోడ్ల మౌలిక సదుపాయాలు ఏడీబీ, ప్రపంచ బ్యాంకు, హడ్కో, నాబార్డ్, వివిధ సంస్థల ద్వారా రూ. 40,847 కోట్లు సమకూర్చామని మంత్రి వివరించారు. 2027 నాటికి అంతా సిద్ధం: ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం భూ సమీకరణ అయ్యాక అభివృద్ధి కోసం కనీసం 24 నుంచి 30 నెలల సమయం పడుతుందన్నారు. మొదటి ఫేజ్ లో కేతనకొండ-నున్న వరకు, రెండో ఫేజ్ లో నున్న-కేతనకొండ వరకు నిర్మాణం జరుగుతుందని మంత్రి నారాయణ వివరించారు. రాజధానిలోని ప్రధాన రహదారుల నిర్మాణం వచ్చే ఏడాదికి పూర్తవుతుంది: మంత్రి నారాయణ మొదటి దశలో 67.6 కిలోమీటర్ల నిర్మాణం, గుంటూరు జిల్లాలో 14, పల్నాడులో 3, కృష్ణాలో 6, ఎన్టీఆర్ లో జిల్లాలో 3 గ్రామాలు, మొత్తం 26 గ్రామాల ద్వారా నిర్మాణం జరుగుతుంది. దీనికోసం డీపీఆర్ కూడా సిద్ధమయ్యింది. ఈ నిర్మాణానికి భూ సమీకరణ కూడా ప్రారంభించాం. ఆరు నెలల్లో భూ సమీకరణ పూర్తి చేసే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. 2027 నాటికి ట్రంక్ రోడ్ల నిర్మాణం పూర్తవుతుంది.' -నారాయణ, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి 200-500 యూనిట్లు ఉచితం: రాష్ట్రంలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమాధానం ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 22,30,703 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మూడు డిస్కంల పరిధిలో 1,02,538 కనెక్షన్లు ఇచ్చామన్నారు. వ్యవసాయ సీజన్ నాటికి పెండింగ్‌లో ఉన్న 46 వేల వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేస్తామని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో డిస్కంలు ఉచిత వ్యవసాయ కనెక్షన్ల కోసం రూ. 839.44 కోట్లు ఖర్చు చేశామన్నారు. పీఎం కుసుమ్ పథకం కింద రాష్ట్రంలో 2,61,481 వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేశామని వివరించారు. ఫీడర్ లెవల్ సోలార్ ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వానికి రూ. 1,059 కోట్లు ఆదా అవుతుందన్నారు. ఏప్రిల్ నుంచి వీవర్స్ కు 200- 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. పోస్టులు-ఖాళీలు: ఏపీఈపీడీసీఎల్ పరిధిలో లైన్ మెన్ ల కొరతపై బండారు సత్యానందరావు అడిగిన ప్రశ్నకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమాధానం ఇస్తూ ఆ పోస్టుల ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఎనర్జీ అసిస్టెంట్ లు 581, జూనియర్ లైన్‌మెన్ పోస్టులు 1260, అసిస్టెంట్ లైన్ మెన్ లు 1084, లైన్ మెన్ పోస్టుల్లో 22 ఖాళీలు ఉన్నాయన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవల కోసం త్వరలోనే ఖాళీలను భర్తీ చేస్తామని ఆయన వెల్లడించారు. వినియోగదారుల సౌలభ్యం కోసం అవుట్ సోర్సింగ్ విధానంలో 8770 మంది పని చేస్తున్నారన్నారు. లోడ్ ఆధారంగా విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

## బ్లాక్ బాక్స్ కాదు గ్లాస్ బాక్స్ విధానం కావాలి'
# వినియోగానికి మోదీ 3సూచనలు

మొదటి పేజి తరువాయి

అనైతిక పద్ధతిలో వాడుకునేందుకు అపరిమిత అవకాశాలు ఉన్నాయి. వీటన్నింటిని అరికట్టేలా ఏఐ కంపెనీలు చర్యలు తీసుకోవాలి. మనకు బ్లాక్ బాక్స్ కు బదులుగా గ్లాస్ బాక్స్ విధానం అవసరం. అందులో భద్రతా నియమాలను ధ్రువీకరించవచ్చు. జవాబుదారీతనం మరింత స్పష్టంగా మారుతుంది. వ్యాపారంలో నైతిక ప్రవర్తన కూడా మెరుగపడుతుంది. మనం ూ×కి ఆకాశమే హద్దుగా ఎదిగే ఆకాశాన్ని ఇవ్వాలి, కానీ అదే సమయంలో మన చేతుల్లోనే పగ్గాలు ఉంచుకోవాలి. కృత్రిమ మేధస్సు అనేది ఒక పరివర్తనాత్మక శక్తి. దీనికి సరైన దిశానిర్దేశం లేకపోతే, అది ఒక పెను వినాశకారిగా మారుతుంది. అదే దానికి సరైన దిశ దొరికితే, అద్భుతమైన పరిష్కారంగా మారుతుంది. ఏఐని యంత్ర-కేంద్రక విధానం నుంచి మానవ-కేంద్రక విధానంగా ఎలా మార్చాలి, దానిని సున్నితంగా, బాధ్యతాయుతంగా ఎలా తీర్చిదిద్దాలి అనేదే ఈ గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ప్రాథమిక లక్ష్యం."

**నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి**

దిల్లీలోని భారత్ మండపంలో నిర్వహిస్తున్న ఐదు రోజుల ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు 2026లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గూగుల్, ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ సీఈవోలు సుందర్ పిచాయ్, సామ్ ఆల్ట్‌మన్, డారియో అమోడీ సహా పలువురు ప్రపంచ టెక్ దిగ్గజాలతో మోదీ గ్రూప్ ఫోటో దిగారు. ఈ సదస్సుకు ఐరాస చీఫ్ అంటోనియో గుటెరెస్, ఫ్రాన్స్, బ్రెజిల్, శ్రీలంక అధ్యక్షులు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్, లులా డాసిల్వా, అనుర కుమార దిసానాయకే సహా భూటాన్, ఫిన్లాండ్, మారిషస్, క్రొయేషియా, సీషెల్స్, సెర్బియా, ఎస్టోనియా దేశాల అధినేతలు హాజరయ్యారు.

### మానవ్ విజన్ ఉండాలని చెప్పిన ప్రధాని మోదీ

అంతకుముందు కృత్రిమ మేధ వినియోగంలో 'మానవ్ (ూ౧ూ౧ూ౧) విజన్' ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ విజన్ అర్థం, ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ఆయన వివరించారు. వీ – మోరల్ అండ్ ఎథికల్ సిస్టమ్: నైతిక విలువలు, బాధ్యతలను పరిగణనలోకి తీసుకుని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వ్యవస్థలకు మార్గనిర్దేశం చేయాలి.




## ఏఐ రంగంలో భారత్ కీలక పాత్ర'- సమ్మిట్‌లో యూఎన్ చీఫ్, టెక్ దిగ్గజాల ప్రసంగం

మొదటి పేజి తరువాయి

భారత్‌లో జరిగే ఈ ఏఐ సమ్మిట్‌కు ప్రత్యేక అర్థం ఉందని చెప్పారు. ఏఐ భవిష్యత్తును కొన్ని దేశాలు లేదా కొంత మంది బిలియనీర్లు నిర్ణయించలేరని స్పష్టం చేశారు. నిజమైన ఇంపాక్ట్ అంటే జీవితాలను మెరుగుపరిచి, భూమిని రక్షించే సాంకేతికత అని అభిప్రాయపడ్డారు.

### దేశంలో మార్పుల వేగాన్ని చూసి ఆశ్చర్యపోతున్నా : సుందర్ పిచాయ్

తాను భారత్‌ను సందర్శించిన ప్రతిసారీ దేశంలో మార్పుల వేగాన్ని చూసి ఆశ్చర్యపోతున్నానని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ స్పష్టం చేశారు. తాను విద్యార్థిగా ఉన్నప్పుడు చెన్నై నుంచి ఐఐటీ ఖరగ్‌పూర్‌కు కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ మీదుగా వెళ్లేవాడినని తెలిపారు. ఇప్పుడు తీరప్రాంత నగరమైన అదే విశాఖపట్నంలో గూగుల్ ఫుల్ స్టాక్ ఏఐ హబ్ ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు. ఈ హబ్ గిగా వాట్ స్కేల్ కంప్యూటర్, కొత్త అంతర్జాతీయ సబ్‌సీ కేబుల్ గేట్‌వేను కలిగి ఉంటుందని అన్నారు. దీని వల్ల యువతకు ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే భారత ప్రజలకు అత్యాధునిక ఏఐ అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

### ప్రతి పౌరుడికి ఏఐని అందించడమే లక్ష్యం : టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్

ప్రజలపై ఏఐ చాలా బలమైన ప్రభావాన్ని చూపుతుందని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అభిప్రాయపడ్డారు. సమాజంపై తీవ్ర ప్రభావం చూపే తదుపరి ప్రధాన మౌలిక సదుపాయం ఏఐయేనని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పౌరుడికి ఏఐ టూల్స్ అందేలా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమాలకు భారత్ సాక్షిగా నిలుస్తోందన్నారు. 'ప్రపంచంలో సగం డిజిటల్ లావాదేవీలు భారత్‌లోనే' అలాగే 140 కోట్ల మంది ప్రజలతో అతిపెద్ద డిజిటల్ ఐడెంటిటీ వ్యవస్థను భారత్ కలిగి ఉందని ఎన్ చంద్రశేఖరన్ స్పష్టం చేశారు. ప్రపంచంలో జరిగే వాటిలో భారత్ నుంచే సగం డిజిటల్ లావాదేవీలు ఉన్నాయని అన్నారు. భారత్‌ను ఏఐ కేంద్రంగా ప్రధాని మోదీ తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. సెమీకాన్ ఇండియా, ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా సాంకేతికత అభివృద్ధి జరుగుతోందని వెల్లడించారు. ఏఐ నైపుణ్య శిక్షణలో భారత్ పురోభివృద్ధి సాధిస్తోందని చెప్పారు.

### 118 దేశాలు హాజరు

గ్లోబల్ సౌత్‌లో మొదటిసారి జరుగుతున్న ఏఐ సమ్మిట్‌లో 118 దేశాలు పాల్గొన్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రపంచంలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద ఏఐ సదస్సు ఇదేనని పేర్కొన్నారు. ఈ సమ్మిట్‌ను విజయవంతం చేసిన దేశాధినేతలు, నాయకులు, టెక్ నిపుణులకు ధన్యవాదాలు వెల్లడించారు. సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తీసుకురావడంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ దృష్టి సారించారని చెప్పారు.


### ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయి : ఆంత్రోపిక్ సీఈఓ

ఏఐ రంగంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ అభిప్రాయపడ్డారు. గత రెండున్నరేళ్లలో ఏఐ రంగంలో భారత్ మంచి పురోగతి సాధించిందని పేర్కొన్నారు. అందుకే ఇటీవల వారంలో బెంగళూరులో తాము ఒక కార్యాలయాన్ని ప్రారంభించామని గుర్తు చేసుకున్నారు. అలాగే ఆంత్రోపిక్ ఇండియా కార్యాలయానికి భారత్‌తో సుదీర వ్యాపార అనుభవం ఉన్న ఇరినా ఘోస్‌ను ఎండీగా నియమించామని తెలిపారు. ఏఐతో అవకాశాలతో పాటు సవాళ్లూ ఉన్నాయని హెచ్చరించారు. ఆ సవాళ్లను పరిష్కరించడంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని స్పష్టం చేశారు.

## క్షమాపణలు కోరి లెంప లేసుకుంటేనే వైఎస్సార్సీపీకి తిరుమల పేరెత్తే అర్హత'

మొదటి పేజి తరువాయి

మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని, కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్ చిట్ చాట్ నిర్వహించారు. లడ్డూలో కల్తీ జరిగిందని వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి ఇద్దరూ ఒప్పుకున్నారని, వారిద్దరితో పాటు సిట్, వివిధ ల్యాబ్స్ కూడా కల్తీని ధృవీకరించాయని అచ్చెన్నాయుడు అన్నారు. గత 3 రోజులుగా శాసన మండలిలో వైఎస్సార్సీపీ వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. లడ్డూలో కల్తీ జరగలేదని ఆ పార్టీ ఎమ్మెల్సీలు సభలో అనడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు సభలో అబద్ధాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. మండలికి వైఎస్సార్సీపీ సభ్యులు తప్పుడు సమాచారం పంపారని దుయ్యబట్టారు. ఇందాపూర్ డెయిరీ నుంచి హెరిటేజ్ చీజ్ కొనుగోలు చేస్తే, దానికి తిరుమల లడ్డూకు సంబంధం ఏంటని? నిలదీశారు. చీజ్ ప్యాకెట్ కు నెయ్యి ప్యాకెట్ కు కూడా తేడా తెలియని స్థితిలో వైఎస్సార్సీపీ ఉందని ఎద్దేవా చేశారు. కల్తీ బురదలో కూరుకుపోయి ఎలా బయటకు రావాలో తెలియని దుస్థితిలో వైఎస్సార్సీపీ ఉందని అచ్చెన్నాయుడు మండిపడ్డారు. జగన్ మానస పుత్రిక అమూల్ : సీఎం చంద్రబాబు వెంకటేశ్వర స్వామి భక్తుడని అందరికీ తెలుసని, అలిపిరి ఘటనలో తన ప్రాణాలు నిలబెట్టింది వెంకటేశ్వర స్వామి అనే నమ్మకం



చంద్రబాబుదని మంత్రి అనగాని సత్యప్రసాద్ గుర్తు చేశారు. అలాంటి వేంకటేశ్వర స్వామికి అపకీర్తి తెచ్చే పని ఎప్పుడూ చంద్రబాబు చేయరని స్పష్టం చేశారు. జగన్ మానస పుత్రిక అమూల్ కూడా ఇందాపూర్ నుంచి కొన్ని కొనుగోళ్లు చేసిందని వెల్లడించారు. వైఎస్సార్సీపీనే ఓ కల్తీ పార్టీ : హెరిటేజ్ కు ఇందాపూర్ డైరెక్టర్లకు ఎక్కడైనా సంబంధం ఉందా? అని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. అలాంటి ఆధారం ఒక్కటైనా వైఎస్సార్సీపీ చూపించగలదా అని సవాల్ విసిరారు. ఇందాపూర్ నుంచి హెరిటేజ్ చీజ్ కొనుగోలు చేసిందే కానీ హెరిటేజ్ ఏనాడూ ఇందాపూర్ కు ఏదీ పంపిణీ చేయలేదని స్పష్టం చేశారు. లడ్డూలో కల్తీ లేదంటున్న వైఎస్సార్సీపీనే ఓ కల్తీ పార్టీ అని మండిపడ్డారు. హెరిటేజ్ సంస్థపై బురద చల్లుతున్నారు : వైఎస్సార్సీపీ నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం హెరిటేజ్ సంస్థపై బురద చల్లుతున్నారని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. అసలు నెయ్యే లేకుండా లడ్డూ తయారు చేసి పాపం అంటగట్టుకున్న వైఎస్సార్సీపీ నేతలు దాన్ని కప్పిపుచ్చుకునేందుకు హెరిటేజ్ సంస్థపై ఆరోపణలు చేస్తూ మరో మహాపాపం మూటగట్టుకున్నారని దుయ్యబట్టారు. ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో నెయ్యి కల్తీపై జగన్‌ను బొత్స సత్యనారాయణ ఏనాడైనా నిలదీశారా అని ప్రశ్నించారు. హెరిటేజ్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చర్చలో పాల్గొనకుండా మండలిలో రచ్చ : వైఎస్సార్సీపీ నేతలు బడ్జెట్ పై చర్చలో పాల్గొనకుండా మండలిలో రచ్చ చేస్తున్నారని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవీ రెడ్డి ఆరోపించారు. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా రాజకీయం కోసమే వైఎస్సార్సీపీ పాకులాడుతోందని మండిపడ్డారు. రోడ్లపై కాకుండా అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలు ప్రస్తావిస్తే ప్రజలు హర్షిస్తారన్నారు. గత ప్రభుత్వ తప్పులను సరిచేస్తూ సుస్థిర పాలన కోసం కూటమి ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని తెలిపారు. రాయలసీమ ఉద్యాన హబ్ కు రూ.30 వేల కోట్లు కేటాయించిన ఘనత సీఎందేనన్న మాధవీరెడ్డి, వ్యవసాయ అనుబంధ యూనిట్స్ ఎన్నో సీమకు వచ్చే అవకాశం ఉందన్నారు.

# సంపాదకీయం

## హక్కు ఆధారిత చట్టాలు ఇక ప్రభుత్వ దయ!

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దుతో దేశంలో ఒక కీలకమైన రాజకీయ ప్రశ్న ముందుకు వచ్చింది: సంక్షేమాన్ని పౌరుల హక్కుగా పరిగణించే ఆలోచన నుంచి భారత ప్రభుత్వం క్రమంగా పక్కకు తప్పుకుంటున్నదా? ఈ పరిణామం కేవలం ఒక పథకం ముగింపునకు సంబంధించింది కాదు. ఇది భారత ప్రజాస్వామ్యంలో పౌరుడికి, రాజ్యానికి మధ్య ఉన్న సామాజిక ఒప్పందం లో వస్తున్న పెనుమార్పుకు సంకేతం. ఒక్క 'నరేగా' విషయంలోనే కాదు; సమాచార హక్కు చట్టం (=ుX), జాతీయ ఆహార భద్రతా చట్టం అటవీ హక్కుల చట్టం వంటి హక్కుల ఆధారిత చట్టాల భవిష్యత్తుపైనా ఇలాంటి ఆందోళనే కలుగుతోంది. ముఖ్యంగా గత పదేళ్ళ మోదీ ప్రభుత్వ పాలనలో సంక్షేమాన్ని చట్టబద్ధమైన హక్కుగా నిర్వహించటం మానేసి, పరిపాలనా నిర్ణయాలు, కార్యనిర్వాహక నియంత్రణల ద్వారా నిర్వహించాలన్న ధోరణి పెరగటం చూస్తున్నాం. స్వాతంత్ర్యానికి ముందు దశలో తొలి జాతీయవాదులు పేదరికం అనేది వ్యక్తిగత వైఫల్యం కాదనీ, వలస పాలనలోని దోపిడీకి వ్యవస్థాగత ఫలితమనీ వాదించారు. పేదరికాన్ని కేవలం వ్యక్తిగత సమస్యగా కాకుండా ఒక నిర్మాణాత్మక సమస్యగా చూడాలనే ఈ దృక్పథం, నాటి వామపక్ష రాజకీయ ఆర్థిక ఆలోచనల ప్రభావంతో మరింత బలపడింది. “స్వతంత్ర భారతదేశ ప్రధాన కర్తవ్యాలు: ఆకలితో ఉన్న ప్రజలకు ఆహారం పెట్టడం; దుస్తులు లేని ప్రజలకు దుస్తులు ఇవ్వడం,” అని రాజ్యాంగ సభలో జవహర్‌లాల్ నెహ్రూ చేసిన ప్రకటనలో ఇదే భావన ప్రతిఫలిస్తుంది. అయితే స్వాతంత్ర్యం తర్వాతి కాలంలో పేదరిక నిర్మూలన అనేది ప్రధానంగా ప్రభుత్వ నేతృత్వంలోని అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల రూపంలోనే కొనసాగింది. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు సామాజిక న్యాయం పట్ల రాజ్యానికి ఉన్న బాధ్యతను స్పష్టంగా ప్రకటించినప్పటికీ, అవి చట్టపరంగా అమలు చేయాల్సిన హక్కులుగా మారలేదు. ఫలితంగా సంక్షేమం పౌరుల చట్టబద్ధ హక్కుగా కాకుండా, పాలనాపరమైన విచక్షణ పైన, రాజకీయ సంకల్పంపైన ఆధారపడిన అంశంగా కొనసాగింది. ఈ పరిమితిని రాజ్యాంగ రూపకల్పన దశలోనే చూడవచ్చు. పని హక్కును ప్రాథమిక హక్కులలో ఎందుకు చేర్చలేదని ప్రముఖ రచయిత ముల్కరాజ్ ఆనంద్ స్వయంగా అంబేడ్కర్‌ను ప్రశ్నించినప్పుడు, ఆయన, “రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీలో నేనొక్కడినే లేను” అని సమాధానమిచ్చారు. అంటే పనిని హక్కుగా మలిచే రాజకీయ సంకల్పం అప్పుడే సంపూర్ణంగా రూపుదిద్దుకోలేకపోయింది. ఈ వైఖరే స్వాతంత్ర్యానంతర కాలంలో సంక్షేమ హక్కుగా గాక, పథకాల రూపంలో కొనసాగడానికి ఒక ముఖ్య కారణంగా మారింది. 1991లో కేంద్ర ప్రభుత్వం ఉదారవాద ఆర్థిక విధానాలను అమలు చేయడం ప్రారంభించిన తరువాత, వాటి ఫలితంగా ఏర్పడిన అసమానతలకు ప్రతిస్పందనగా దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు ఊపందుకున్నాయి. ఆహారం, ఉపాధి, పారదర్శకత, గౌరవం వంటి మౌలిక అంశాల చుట్టూ సాగిన ఈ పోరాటాలు సంక్షేమాన్ని హక్కుల ఆధారంగా పునఃరూపకల్పన చేయాలన్న ఆలోచనకు బలమైన పునాదిని వేశాయి. ఈ ఉద్యమాలలో అత్యంత ప్రభావవంతమైనది రాజస్థాన్‌లో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (వీఖూూ) నేతృత్వంలో సాగిన సమాచార హక్కు ఉద్యమం. 'హమారా ఖర్చా, హమారా హిసాబ్' (మన సొమ్ముమన లెక్కలు) అనే నినాదంతో ప్రజా పనులకు సంబంధించిన అవినీతిని బహిర్గతం చేసిన ఈ ఉద్యమం, 'పారదర్శకత'ను 'వేతనాలు', 'ఉపాధి' వంటి కార్మికుల మౌలిక హక్కులతో నేరుగా ముడిపెట్టింది. సమాచారాన్ని కేవలం ఒక సూత్రంగా గాక, న్యాయమైన, గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన అనివార్యమైన షరతుగా ప్రజల ముందుకు తెచ్చింది. అదే సమయంలో, ఆర్థిక వృద్ధి జరుగుతున్నప్పటికీ ఆకలి, పోషకాహార లోపాలు ఎందుకు కొనసాగుతున్నాయన్న ప్రశ్నతో ఆహార హక్కుల ఉద్యమాలు మొదలయ్యాయి. 2001లో పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ సుప్రీంకోర్టును ఆశ్రయించి, ఆహార హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు) నుంచి ఉద్భవించిందని వాదించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తదుపరి ఉత్తర్వులు ప్రజా పంపిణీ వ్యవస్థను, మధ్యాహ్న భోజనం వంటి పథకాలను జీవించే హక్కుతో ముడిపడిన చట్టబద్ధ హక్కులుగా గుర్తించాయి. 2004లో యూపీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా ఉద్యమాల ద్వారా వచ్చిన హక్కుల డిమాండ్లను చట్టరూపంలోకి తేవడానికి ఒక రాజకీయ అవకాశం ఏర్పడింది. సామాన్యుడి కోసం పాలన అందిస్తామని ప్రకటించిన యూపీఏ ప్రభుత్వం ప్రజా ఒత్తిళ్లకు స్పందించక తప్పలేదు. అందువల్లనే 'సమాచార హక్కు చట్టం' (2005), 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' (2005), 'అటవీ హక్కుల చట్టం' (2006), 'జాతీయ ఆహార భద్రతా చట్టం' (2013) వంటి కీలక హక్కుల ఆధారిత చట్టాల అమలు మొదలైంది. ఈ చట్టాలు సంక్షేమాన్ని పరిపాలనా విచక్షణ పరిధి నుంచి బయటకు తీసి, అమలు చేయాల్సిన చట్టబద్ధ హక్కులుగా మార్చాయి. కానీ గత దశాబ్ద కాలంగా ఈ హక్కుల ఆధారిత చట్టాలు బలహీనమవుతూ వస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం వాటిని అమలు చేయాలన్న రాజకీయ సంకల్పం తగ్గడమే. సంక్షేమాన్ని పౌరుల చట్టబద్ధ హక్కుగా కాకుండా, నియంత్రణలు, పరిపాలనా విధానాల ద్వారా నిర్వహించాలన్న పాత దృక్కోణం మరలా బలపడింది. ఈ ధోరణి ఒకటి రెండు విధాన నిర్ణయాలకు పరిమితం కాకుండా, నిరంతర పరిపాలనా చర్యలు, మార్గదర్శకాలు, సాంకేతిక షరతుల రూపంలో వ్యవస్థాగతంగా లోతుగా పాతుకుపోయింది. అంతేకాదు, తీవ్ర రాజకీయ ప్రతిఘటనల మధ్య రూపొందిన ఈ చట్టాల్లోనే రాజ్యానికి విస్తృత కార్యనిర్వాహక వెసులుబాటు కల్పించే నిర్మాణ లక్షణాలు మొదటి నుంచీ అంతర్లీనంగా ఉన్నాయి

# అందరిదీ రక్షణ మార్గమే!



ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, ప్రాంతీయ సంఘర్షణలు, అణ్వస్త్ర హుంకరింపులు, ట్రంప్ పెడపోకడలతో పలు దేశాలు రక్షణ రంగానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇరువైపులా అణ్వస్త్ర దేశాలు కలిగిన భారత్ పరిస్థితి ఎప్పుడూ సంక్లిష్టమే. 'ఆపరేషన్ సిందూర్' తరవాత రక్షణ రంగ బలోపేతానికి భారత ప్రభుత్వం సైతం గట్టిగా సంకల్పించింది. 2026–27 రక్షణ బడ్జెట్‌ను అనూహ్యంగా పెంచడం, రఫేల్ యుద్ధవిమానాలు, సముద్ర నిఘా విమానాల కొనుగోలుకు పూనుకోవడమే ఇందుకు నిదర్శనం. ఈసారి కేంద్ర బడ్జెట్‌లో రక్షణ శాఖకు కేటాయింపులు దాదాపు 15 శాతం పెరిగాయి. సుమారు రెండు దశాబ్దాల తరవాత రక్షణ పద్దులో రెండంకెల వృద్ధి సాధ్యమైంది. కొత్త ఆయుధాల కొనుగోలుకు ఉద్దేశించిన మూలధన వ్యయం కింద కేటాయింపులనూ పెంచారు. మూలధన వ్యయంలో 75 శాతాన్ని దేశీయ పరిశ్రమల నుంచి కొనుగోళ్లకు ప్రత్యేకించడం విశేషం. ఆపరేషన్ సిందూర్ పరిణామాలు భావి యుద్ధతీరుతెన్నులపై మేల్కొలుపు సందేశంలా పనిచేశాయి. దీంతో సైనిక ఆధునికీకరణ, స్మార్ట్ ఆయుధాల సేకరణ, మెరుగైన పోరాట సన్నద్ధతలకు మునుపెన్నడూ లేనిస్థాయిలో ప్రాధాన్యం పెరిగింది. అయితే, తాజా రక్షణ కేటాయింపులు జాతీయ భద్రతా అంశాల్లో అంతరాన్ని కొంత మేర పూడ్చుకోవడానికే ఉపకరిస్తాయని, వాటిని పూర్తిగా తొలగించడానికి సరిపోవన్న అభిప్రాయం విశ్లేషకుల్లో ఉంది. 'సిప్రీ' అంచనాల ప్రకారం, రక్షణకు ఎక్కువగా ఖర్చు చేస్తున్న దేశాల్లో భారత్ అయిదోది. అయితే ఆ వ్యయం ప్రస్తుత దేశ అవసరాల స్థాయిని ప్రతిబింబించడంలేదన్న విమర్శ ఉంది. ముఖ్యంగా చైనా సైనిక ఆధునికీకరణ వేగం కారణంగా, మన రక్షణ పద్దును గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉంది. మరోవైపు తాజా బడ్జెట్‌లో రక్షణ శాఖకు ప్రతిపాదించిన మూలధన కేటాయింపుల్లో సింహభాగం ఇప్పటికే కొనుగోలు చేసిన ఆయుధాలకు సంబంధించిన కిస్తీల చెల్లింపులకే పోతుంది. కొత్త సమీకరణలకు నిధులు తక్కువగానే అందుబాటులో ఉంటాయి.

### భారీగా అవసరాలు...

పొరుగు దేశంతో ఘర్షణలు తలెత్తిన సందర్భాల్లో కొన్నేళ్లపాటు రక్షణ బడ్జెట్‌కు ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వాలు ఆ తరవాత అదేస్థాయి ఊపును కొనసాగించడం లేదని గత అనుభవాలు చెబుతున్నాయి. కార్గిల్ యుద్ధానంతరం భారత్ కొన్నేళ్ల పాటు జీడీపీలో 2.5శాతాన్ని రక్షణ రంగానికి కేటాయించింది. దీనివల్ల మన సైనిక బలగాల పోరాట సామర్థ్యం వేగంగా పెరిగింది. ఆ తరవాత జీడీపీలో రక్షణ బడ్జెట్ వాటా రెండుశాతం కన్నా తక్కువకు పడిపోయింది. దీంతో కీలక సైనిక ఆధునికీకరణ ప్రాజెక్టులు మందగమనంలో సాగుతున్నాయి. వాస్తవానికి రక్షణ రంగంలో భారత్ అవసరాలు భారీగా ఉన్నాయి. వాయుసేనలో ఫైటర్ స్క్వాడ్రన్ల సంఖ్య ఆందోళనకర స్థాయికి పడిపోయింది. ఈ లోటును కొంతవరకూ పూడ్చుకోవడానికి ఫ్రాన్స్ నుంచి 114 రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలుకు భారత్ నడుం బిగించింది. ఫైటర్ జెట్‌లకు నింగిలోనే ఇంధనాన్ని నింపే ట్యాంకర్ విమానాలు, గగనతల ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు(అవాక్స్), రష్యా నుంచి అదనంగా ఎస్–400 రక్షణ వ్యవస్థ వంటివాటి కొనుగోలుకు కసరత్తు జరుగుతోంది. విదేశీ భాగస్వామ్యంతో జెట్ ఇంజిన్ల అభివృద్ధికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. సుఖోయ్–30 ఎంకేఐ యుద్ధవిమానాల ఆధునికీకరణ చేపట్టాల్సి ఉంది. నౌకాదళంలో పీ–75(ఐ) ప్రాజెక్టు కింద ఆరు అధునాతన సబ్‌మెరైన్ల సమీకరణకు జర్మనీతో ఒప్పందాన్ని కుదుర్చుకోవాల్సి ఉంది. రక్షణపరంగా భారత్‌కు పొంచి ఉన్న ముప్పులు, అవసరాల నేపథ్యంలో కొన్నేళ్లపాటు రక్షణ రంగానికి జీడీపీలో మూడు శాతానికి మించి కేటాయింపులు జరపాలన్న డిమాండ్ ఎప్పటినుంచో వినిపిస్తోంది. కొత్తగా వస్తున్న హైటెక్ ఆయుధాల ధర భారీగా ఉంటోంది. తాజా బడ్జెట్‌లో రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో), పలు ఇతర పరిశోధన సంస్థలకు కేటాయింపులు పెంచారు. నిజానికి ఇతర సంస్థలు చేసే పరిశోధనలతో రక్షణ రంగానికీ ప్రయోజనం ఉంటుంది. కానీ మన దేశంలో ఈ 'జోడు లబ్ధి' కోణంలో కసరత్తు ఎక్కువగా సాగడంలేదు. ప్రైవేట్ రంగంలోనూ ఆర్‌అండ్‌డీ పెరగాలి. రక్షణ కేటాయింపులను అభివృద్ధేతర అంశంగా చూడకూడదని నిపుణులు సూచిస్తున్నారు. దేశీయ నౌకానిర్మాణం వల్ల అనేక అనుబంధ పరిశ్రమలు వస్తాయని, దానివల్ల ఉపాధి రంగంపై 6.5రెట్లు ప్రభావం ఉంటుందన్న ప్రధానమంత్రి వ్యాఖ్యలను వారు గుర్తుచేస్తున్నారు. పెరిగిన రక్షణ కేటాయింపులను ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చే సాధనంగా పరిగణించాలని నిపుణులు సూచిస్తున్నారు. దేశీయ ఆయుధ ఉత్పత్తి సామర్థ్యం పెరిగితే ఎగుమతులూ పెరుగుతాయి. ఇందుకోసం పెద్ద పరిశ్రమలతోపాటు చిన్న సంస్థలనూ ప్రోత్సహించేలా ప్రభుత్వ విధానాలు ఉండాలి. రక్షణ ఉత్పత్తి అధికమైతే దేశంలో మానవ నైపుణ్యాలు, పరిశోధనలు పెరుగుతాయి.

బలంగా ఉండటం అనివార్యం

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్‌కు చైనా దొంగచాటుగా సాయం అందించడంతో ఆ రెండు దేశాల కుమ్మక్కు తంత్రం బట్టబయలైంది. భారత్‌ను దొంగ దెబ్బతీయాలన్న డ్రాగన్ కుట్ర తేటతెల్లమైంది. దీంతో మనం మరింత అప్రమత్తంగా ఉండక తప్పదు. భవిష్యత్‌లో పాక్, చైనాలను ఉమ్మడిగా ఎదుర్కోవాల్సిన పరిస్థితికి సన్నద్ధం కావాలి. అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించగల బాంబులు, నింగిలో సంచరిస్తూ అదును చూసి విరుచుకుపడే లాయిటరింగ్ మ్యునిషన్లను భారీగా నిల్వ చేసుకోవాల్సిన అవసరాన్ని 'ఆపరేషన్ సిందూర్' సూచించింది. ఆ దిశగా తాజా రక్షణ కేటాయింపులు ఒక ముందడుగేనని చెప్పొచ్చు. రెండో ప్రపంచ యుద్ధం తరవాత యుద్ధ వ్యతిరేక, శాంతికాముక దేశంగా ఉన్న జపాన్ కూడా నేడు రక్షణ రంగానికి జీడీపీలో 2.2శాతం నిధులు కేటాయిస్తోంది. పెద్దగా శత్రు బెడదలేని ఆస్ట్రేలియా కూడా అదే బాటలో పయనిస్తోంది. ఐరోపా దేశాలదీ ఇదే దారి. ప్రస్తుత భౌగోళిక–రాజకీయ పరిస్థితుల్లో సరిహద్దులను కాచుకోవడం ప్రాణావసరం. యుద్ధాలు రాకూడదనుకుంటే రక్షణపరంగా బలంగా ఉండాల్సిందే. నేడు ప్రపంచ యవనికపై 'బలవంతుడి' మాటే చెల్లుతుందన్నది గుర్తుంచుకోవాలి.

# 33 ఏళ్లకే రిటైర్మెంటా ఉద్యోగుల సమస్యలపై కొత్త దృష్టి మళ్లింపా!

రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు కోకొల్లలుగా వుండగా కొత్తగా ప్రభుత్వం 33 ఏళ్లకే ఉద్యోగులు ఇంటికి అంటూ ఒక చిన్న తేనె తుట్టెను కదిపింది. తమకు అనుకూలంగా వుండే మీడియాకు లీకులిచ్చి ఒక పెద్ద చర్చకు తెరలేపింది. రాష్ట్రంలో కుప్పలు తెప్పలుగా పేరుకుపోయివున్న ఆర్థిక, ఆర్థికేతర, సర్వీస్ సమస్యలను గాలికి వదిలి రిటైర్మెంట్ సమస్యను ప్రభుత్వమే వ్యూహాత్మకంగా తెరపైకి తెచ్చింది.

**ఏఐ క్యాపిటల్‌గా భారత్.. దిశానిర్దేశం చేసే ఢిల్లీ సమ్మిట్!**

ఉద్యోగులు రిటైరైన రెండేళ్లకు కూడా వారికి చెల్లించాల్సిన బెనిఫిట్లను అందించలేని పరిస్థితిలో ఉంది ప్రభుత్వం. ఈ దశలో 33 సంవత్సరాల సేవాకాలం పూర్తి చేసిన ఉద్యోగులను బలవంతంగా ఇంటికి పంప డం జరిగే పనేనా? 11వ వేతన సవరణ ప్రయోజనాల చెల్లింపులు, 12వ వేతన సంఘం ఏర్పాటుకు సూర్యాస్తమయం అయింది. 2028లో 13వ వేతన సవరణ సంఘం అమల్లోకి రావాల్సి ఉండగా నిమ్మకు నీరెత్తినట్లు వున్న ప్రభుత్వం కొత్త సమస్యలను తెరమీదకు తేవడం అసంబద్ధ చర్యగానే భావించాల్సి ఉంటుంది.

**ఛత్రపతి.. స్వరాజ్య ప్రజాపతి!**

### సమిష్టి పోరాటాలు లేకపోవడంతో..

ప్రభుత్వంతో పోరాడడంలోనూ, చర్చల ద్వారా ఒప్పించడంలోనూ సంఘాలు చాలా బలహీనంగా ఉన్నాయి. సంఘాల్లో రాజకీయ పోలరైజేషన్, అనుకూల విధానాలు, కుల సమీకరణలు ఉద్యోగ నేతల మధ్య లంగరువేసి వున్నాయి. పైకి ఎంత డాంబిక ప్రకటనలు ఇస్తున్నా పాలకుల వైఖరిలో వచ్చిన మార్పులతో భీతిల్లుతున్నారు.. ఇక కొన్ని సంఘాల నాయకులేమో ప్రభుత్వాధినేతలతో అంటకాగుతూ ఉద్యోగ విరమణ అనంతరం రాజకీయ ప్రయోజనాలు పొందడానికి ప్రస్తుత కాలాన్ని వినియోగిస్తున్నారు. సమిష్టి పోరాటాలు లేవు.. ఉద్యోగుల సంఖ్య తగ్గుతుండగా సంఘాల సంఖ్య పెరుగుతోంది. దీంతో సంఘాల పట్ల సభ్యులకు ఆపనమ్మకం పెరిగింది. ఈ వైఖరే ఉద్యోగుల ప్రయోజనాలకు చాలా వరకు ప్రతిబంధకంగా మారింది. గతంలో ఉద్ధండులైన ముఖ్య మంత్రులు, రాజకీయ బలం కలిగిన నేతలు రాష్ట్రాన్ని పాలించినపుడు కూడా సంఘాలు ఐకమత్యంగా ఎదుర్కొనగలిగేవి. ఉద్యోగులకు అనుకూలంగా పాలకులను మెప్పించేవి, ఒప్పించేవి. కానీ కొత్త ప్రభుత్వం కొలువు దీరి ఏడాదిన్నర కాలం గడిచినా సంఘాల కదలికలు అస్పష్టంగా వున్నాయి.

గుర్తింపు రాకముందే అడ్మిషన్లు.. విద్యార్థుల భవిష్యత్తుపై చింత

### వేతన పెరుగుదల ఉంటే ఒకే.. కానీ




దేశంలోనూ, రాష్ట్రంలోనూ పెద్దఎత్తున నిరుద్యోగ సమస్య తాండవిస్తోంది. మూడు పదులు దాటినా ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు రాని స్థితి ఉంది. అసలు ప్రభుత్వం ఉద్యోగాల నియామకాలపైనే ప్రపంచ బ్యాంక్ నీలి పరదా కప్పేసింది. 50 ఏళ్లకు కూడా రిజర్వేషన్ విభాగంలో ఉద్యోగాలు కల్పించే ప్రకటనలు మనం చూస్తున్నాం. పోనీ ఉద్యోగం వచ్చిన తరువాత ఆయా ఉద్యోగుల కుటుంబాలు ఆర్థికంగా కుదురుకునే విధానంలో వేతన పెరుగుదల, స్థిరీకరణ జరిగితే 33 ఏళ్ల సర్వీస్ చాలా ఎక్కువ.. కానీ ప్రస్తుత పరిస్థితి అలా లేదు.. స్వేచ్ఛా విఫణిలో కనీస అవసరాలు తీర్చే వస్తుధరలు మిన్నంటుతున్నా వాటికీ సమీపంలో వేతనాల పెరుగుదల లేదు.. మరోవైపు ఏడాదిలో ఒకటిన్నర నెల జీతం ఆదాయ పన్ను శాఖకు ఎదురు చెల్లించాల్సి రావడం, అనారోగ్య బాధలకు ఆస్పత్రుల బిల్లులు, ఇతరత్రా ఖర్చులు తడిసి మోపెడై వేతనజీవుల వెన్ను విరుస్తోంది. కుటుంబాల సంపాదన చాలక అప్పులు చేసి చివరకు రిటైర్మెంట్ సొమ్ముల కోసం అప్పులు ఎదురు చూసే భీతావహ దృశ్యం ఇప్పుడుంది.

**నేను మరణిస్తే.....బూడిదనై**

### నష్టపోతున్నా.. సర్వీస్ ప్రామాణికమా?

గత పీఆర్సీల్లో మూలవేతన పెరుగుదల శాస్త్రీయంగా, నిలకడగా సాగలేదు.. ఒక్క (3వ) కేటగిరిని వివిధ పీఆర్సీల్లో పరిశీలిస్తే.. 1982లో 3వ కేటగిరి బేసిక్ 530 వుండగా 2015 పిఆర్సీలో 10900 నుండి 21230లో ఫిక్స్ చేయబడింది. అయితే 2022లో ఆ విధానానికి తూట్లుపడి భారీగా నష్టపోవడం జరిగింది. ఇలా నష్టపోతున్నంత కాలం ఎంత సర్వీస్ అన్నది ప్రామాణికం కాదు. ఆ నిష్పత్తిలోనే పెన్షన్‌లోనూ నష్టం చవి చూస్తున్నారు.. ఇక సర్వీస్ నిబంధనల్లోనూ 1980 నిబంధనల్లో =బశ్రీవ –44 ప్రకారం 33 సంవత్సరాల అర్హత సేవ పూర్తిచేసిన ఉద్యోగికి రెండు అవకాశాలు ఉండేవి.. ఒకటి స్వచ్ఛంద రిటైర్మెంట్, రెండవది ప్రజాహితం దృష్ట్యా తప్పనిసరి రిటైర్మెంట్. కానీ 2026లోని =బశ్రీవ 14 ప్రకారం 33 సంవత్సరాల సేవ పూర్తి చేసిన ఉద్యోగిని ప్రజాహితం దృష్ట్యా మాత్రమే తప్పనిసరిగా రిటైర్ చేయవచ్చు.. స్వచ్ఛంద రిటైర్మెంట్ గురించి ప్రస్తావన లేదు. అయితే 2026 నిబంధనల =బశ్రీవ 13 ప్రకారం 20 సంవత్సరాల అర్హత సేవ పూర్తైన తర్వాతే స్వచ్ఛంద రిటైర్మెంట్ అవకాశం, వాలంటరీ రైటైర్మెంట్ పెన్షన్ అందుబాటులో ఉంది. అందువల్ల 33 సంవత్సరాల తర్వాత ప్రత్యేక స్వచ్ఛంద రిటైర్మెంట్ లేకపోయినా ఉద్యోగులకు ఇబ్బంది లేదు..


# వలస పాలకుల వంచనల పరంపర

### ఆంధ్ర పాలకుల కథ, తెలంగాణ వ్యథ–30

ఆంధ్రా ముఠా ద్వారా తెలంగాణకు నష్టం చేయించడమే కాకుండా, తన వ్యక్తిగత చర్యల వల్ల కూడా తీర్చలేని కష్టాలు, నష్టాలు కలిగించారు సమైక్య పాలకులు. ఉమ్మడి రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి నుంచి ఆఖరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి వరకు తెలంగాణకు నష్టం చెయ్యని ఆంధ్రా పాలకుడు ఒక్కరూ లేరు ఆ గుంపులో. వలస పాలకుల వివక్ష తెలంగాణ జిల్లాలను సంక్షోభంలో పడేసింది. అప్పర్ కృష్ణా, భీమా ప్రాజెక్టులను ఆపేయడంతో పాలమూరు జిల్లా ఎండిపోయింది. రైతుల్లో ఎక్కువ శాతం ఇతర జిల్లాలకు, రాష్ట్రాలకు కూలీ పనుల కోసం వలసపోయారు. కృష్ణా నదీ జలాలు రాయలసీమకు ఎక్కువగా తరలించాలని వలస వంచకులు ఈ ప్రాజెక్టులను నిలిపివేశారు. దాంతో 2014 వరకు రోజూ రాత్రి పూటకు 3 బస్సుల నిండా ఆ జిల్లా వాసులు ఇతర రాష్ట్రాలకు వలసపోయారు. ఇది మూడు తరాల వారిని హింసపెట్టిన వలస పాలకుల 27వ తప్పు. 2014 తర్వాత తెలంగాణ పాలనలో మార్పు వచ్చింది. ఇప్పుడు వలస బస్సులు ఆగిపోయాయి.

### గతవారం ప్రచురించిన 'కాంగ్రెస్ పాపాలు.. చిత్రగుప్తుడి చిట్టాలోంచి'కి కొనసాగింపుగా

17. తెలంగాణలో నీటిపారుదల సౌలభ్యం కోసం 1944 నాటికే నిజాం ప్రభుత్వం చాలా ప్రాజెక్టులను సిద్ధం చేసింది. అప్పటి పరిస్థితుల్లో వెంటనే వాటిని ప్రారంభించడానికి వీలుపడలేదు. వెల్లోడి ప్రభుత్వం 1951 జూలైలో ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఆ ప్రాజెక్టులన్నింటికీ అనుమతి పొందింది. కానీ, ఫజల్ అలీ తన నివేదికలో పేర్కొన్నట్టు ఆంధ్రాతో విలీనమయ్యాక ఈ ప్రాజెక్టులన్నీ మూతపడ్డాయి. ఆయన ఊహించిందే నిజమై తెలంగాణ మిగులు నిధులు రూ.67 కోట్లు ఆంధ్రాలోని ప్రకాశం బరాజ్, ధవళేశ్వరం ఆనకట్టలు మళ్లీ కట్టడానికి ఆంధ్రా పాలకుల బ్యాంకు ఖాతాల్లోకి వెళ్లాయి. డబ్బు ముఖం చూడక ఆంధ్ర రాష్ట్రంలో అల్లాడినవారు కుబేరులయ్యారు. తెలంగాణ తలపెట్టి, అనుమతులు పొందిన ప్రాజెక్టులు మూలనపడ్డాయి, పురుడు పోసుకోకుండానే మరణించాయి. ఇది కాంగ్రెస్ పార్టీ, నెహ్రూ చేసిన 17వ పాపం! దీనివల్ల ఐదు దశాబ్దాలు నరకం అనుభవించిన తెలంగాణ.. ఆ పార్టీని ఆదరించకూడదు. 18. 1923–31లో నిర్మించిన నిజాంసాగర్, అప్పర్



మానేరు (1950), ఘనపూర్ ఆయకట్టు (1905), డిండి, మూసీ (1954) అన్నీ నిజాం కాలంలో మొదలుపెట్టిన ప్రాజెక్టులే. రామప్ప, పాకాల, ఘనపురం, శనిగరం, శాలిగౌరారం, పెండ్లిపాకల, భీమునిపల్లి, ఆసిఫ్‌నగర్‌ను కూడా నిజాం పునరుద్ధరించారు. నిజాం రాజులు ప్రజలకు అత్యవసరమైన వ్యవసాయం పట్ల ఎంత శ్రద్ధ తీసుకున్నారంటే 1867 నాటికే ఏటా బడ్జెట్‌లో రూ.2 లక్షలు నీటిపారుదల రంగానికి కేటాయించేవారు. రోస్ అలెన్ అనే బ్రిటిష్ ఇంజినీర్, నీటిపారుదలరంగ నిపుణుడిని చీఫ్ ఇంజినీర్‌గా నియమించారు 1897లో. ఈ రంగం గురించి ఇంత శ్రద్ధ తీసుకున్న నిజాంకు వ్యతిరేకంగా పోట్లాడిన కమ్యూనిస్టులకు ఆంధ్రా కుటిలత్వాలు కండ్లబడలేదు. ఏ ఒక్కరోజూ, ఏ ఒక్క అన్యాయాన్నీ ఎదుర్కోవటానికి పోరాటం చేయలేదు.. అప్పుడప్పుడు మాటలు తప్ప. ఆ పార్టీకి కూడా, కాంగ్రెస్‌తోపాటు మంగళం పాడాలి తెలంగాణ ప్రజలు. ఇది ఈ పార్టీలు చేసిన 18వ పాపం! 19. నెహ్రూ మంత్రివర్గంలో ఆంధ్రా మనిషే అయిన కేఎల్ రావు అనే ఇంజినీర్ నీటిపారుదలశాఖ మంత్రిగా ఉండేవాడు. ఆయన స్పష్టంగా పోచంపాడు ప్రాజెక్టు తెలంగాణకు ఎంత ముఖ్యమో చెప్పాడు. అయినా 1958లో ఆ ప్రాజెక్టు సామర్థ్యాన్ని పావు వంతుకు తగ్గించాడు సంజీవరెడ్డి. 257 టీఎంసీలతో ఆరు జిల్లాలకు నీరు అందించాల్సిన ఆ ప్రాజెక్టును 60 టీఎంసీలతో 2 జిల్లాలకు మాత్రమే పరిమితం చేసి, పాపం మూటగట్టుకున్నాడు సంజీవరెడ్డి. దానితో ప్రతిపాదించిన ఉత్తర కాల్వ విద్యుత్తు ఉత్పాదన, దక్షిణ కాల్వ, మానేరు డ్యామ్ అన్నీ రద్దయిపోయాయి ఆయన మూలంగా. 20. ఇంకొక పని ఏమిటంటే.. లక్ష ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్‌కు తాగునీరు అందించే దేవునూరు ప్రాజెక్టును నీలం సంజీవరెడ్డి నిష్కారణంగా రద్దు చేశాడు. అది గొప్ప బహుళార్థ సాధక ప్రాజెక్టు. తాగునీరు, సాగునీరు, విద్యుత్తు ఉత్పాదన చేసే బంగారు ప్రాజెక్టు ఆ నిరంకుశుడి వల్ల రద్దయిపోయింది. 21. ఈ ప్రాజెక్టును విరమించుకున్నందుకు పోచంపాడు సామర్థ్యాన్ని కుదించవద్దని ముఖ్యమంత్రిని రీజినల్ కమిటీ కోరింది. కానీ, తెలంగాణకు నష్టం చేకూర్చే పనికి పాల్పడ్డాడు.. సంజీవరెడ్డి. తెలంగాణ ప్రాంత శాసనసభ్యుల మాటలను కూడా పట్టించుకోలేదు. ఇది కాంగ్రెస్ పార్టీ 21వ తప్పు. ఆ కుదించిన ప్రాజెక్టుకే ఏమీ పట్టనట్టు 1963 జూలైలో నెహ్రూ శంకుస్థాపన చేశాడు. రాష్ట్రానికి జరిగిన అన్ని అన్యాయాల్లో కేంద్రానికి కూడా పాత్ర ఉన్నది. 22. ఈ ప్రాజెక్టును ఇంకో రకంగా కూడా నిర్వీ ర్యం చేశాడు నీలం సంజీవరెడ్డి. 234 టీఎంసీల నీళ్లు లభిస్తున్నా మొదట 66 టీఎంసీలు చాలనీ, చివరిగా 41 టీఎంసీల నీళ్లు తెలంగాణ ప్రాజెక్టుకు ఖరారు చేశాడు ఆయనే. మిగతా నీరంతా ఆంధ్రాకే పారుతుంది కదా! ఇది 22వ తప్పు. 23. మొదట కడెం ప్రాజెక్టుకు 53 టీఎంసీల నీరు కేటాయించారు. దాన్ని వలస ప్రభుత్వం 12 టీఎంసీలకు కుదించింది. ఇది 23వ తప్పు. 24. వలస పాలకులు చేసిన ఇంకొక ద్రోహం ఏమిటంటే.. 1963లో ప్రారంభించిన పోచంపాడు ప్రాజెక్టు కోసం కొనుగోలు చేసిన సామానంతా శ్రీశైలానికి తరలించి, ఆ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేశారు. ఇది 24వ తప్పు, తీవ్ర అన్యాయం. 25. ఆ కాలమంతా తెలంగాణకు చెందాల్సిన నీళ్లను చాలా సమైక్య ప్రభుత్వం తక్కువగా తీసుకునేటప్పటికీ, ఆ నీటిని మహారాష్ట్రకు, కర్నాటకకు కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది. అయినా కూడా ఈ వలస ముఖ్యమంత్రులు నోరు విప్పలేదు. వేరేవాళు బాగుపడవచ్చు, కానీ తెలంగాణ మాత్రం కూలిపోవాలి, ఎడారిగా మారాలి అనీ అలాగే మార్చారు కూడా! ఇది 25వ తప్పు. 26. ఉభయ ప్రాంతాలకు అవసరమున్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు విషయంలో కూడా తెలంగాణకు చాలా అన్యాయం జరిగింది.

# బ్లాక్ కిస్మిస్ తింటున్నారా - ఎలా తింటే ఆరోగ్యానికి మంచిదో తెలుసా

## బ్లాక్ కిస్మిస్ తో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు - పద్ధతి ప్రకారం తినాలంటున్న నిపుణులు



చాలామంది బాదం, కిస్మిస్, జీడిపప్పు వంటి డ్రై ఫ్రూట్స్‌ని పచ్చిగానే తింటుంటారు. కానీ, వీటిని నానబెట్టి తీసుకుంటే ఈ పదార్థాల్లోని పోషకాలు రెట్టింపయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అందులోనూ నానబెట్టిన బ్లాక్ కిస్మిస్ తీసుకోవడం తినడం వల్ల ఆరోగ్యానికి అదనపు ప్రయోజనాలు చేకూరతాయంటున్నారు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

రక్తహీనతకు చెక్ :

మహిళలకు నెలసరి, ప్రెగ్నెన్సీ సమయాల్లో శరీరం ఎక్కువ రక్తం కోల్పోతుంది. దీనివల్ల మహిళల్లో రక్తహీనత (ఖఅవవఎఖు) తలెత్తుతుంది. అయితే, ఈ సమస్యకు బ్లాక్ కిస్మిస్ పరిష్కారం చూపుతుందని జీశీబతీఖుశ్రీ శీట ౧ాఘ్టుతీఖెవబ్‌అఖుశ్రీ =వంఘుతీఎష్ట్ర ×త్‌వతీఖ్‌అశీఖుశ్రీ ప్రచురించింది. ఇందుకు కారణం దీనిలో ఐరన్ శాతం అధికంగా ఉంటుందట. అయితే, వీటిని నేరుగా కంటే నానబెట్టుకొని తీసుకుంటే.. ఇందులోని ఐరన్‌ని శరీరం మరింత సులభంగా గ్రహిస్తుందని నిపుణులు చెబుతున్నారు. తద్వారా రక్తం పెరగడంతోపాటు అలసట, నీరసం దూరమై శరీరానికి తక్షణ శక్తి కూడా వస్తుందని తెలియజేస్తున్నారు.

హార్మోన్లు సమతులంగా :

హార్మోన్ల అసమతుల్యత చాలామంది మహిళలకు సమస్యగా ఉంటుంది. దీంతో నెలసరి క్రమం తప్పడం, సంతానలేమి, ప్రత్యుత్పత్తి సమస్యలు, మొటిమలు, అవాంఛిత రోమాలు రావడం వంటి దుష్ప్రభావాలు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు. వీటిని దూరం చేసుకోవాలంటే నానబెట్టిన బ్లాక్ కిస్మిస్‌లను రోజూ ఆహారంలో చేర్చుకోవాలని సూచిస్తున్నారు. వీటిలో ఉండే బి, సి, కె విటమిన్లు.. మెగ్నీషియం, క్యాల్షియం వంటి ఖనిజాలు హార్మోన్లను ఉత్పత్తి చేసే అడ్రినల్ గ్రంథుల పనితీరును మెరుగుపరుస్తాయని చెబుతున్నారు. తద్వారా హార్మోన్ల ఉత్పత్తి బ్యాలన్స్ అవుతుందని పేర్కొంటున్నారు. ఇది అటు శరీర ఆరోగ్యానికి, ఇటు మానసిక ఆరోగ్యానికి మంచిదట.

సంతాన భాగ్యం :

ప్రస్తుతం చాలామంది మహిళలు సంతాన లేమి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వారికి బ్లాక్ కిస్మిస్ వరమంటున్నారు నిపుణులు. ఐరన్, ఫోలేట్, యాంటీ ఆక్సిడెంట్లు వంటి పోషకాలు అధికంగా ఉండే ఇవి ప్రత్యుత్పత్తి వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయని చీఖ్‌అశీఖుశ్రీ ౧ాఅఎతీఖుతీఎ శీట వీవఎఅఖుఎఅవ అధ్యయనం పేర్కొంది. తద్వారా సులువుగా గర్భం దాల్చే అవకాశాలు పెరుగుతాయని వెల్లడిస్తున్నారు. వీటిని నానబెట్టుకొని తినడం వల్ల గర్భాశయం పనితీరు మెరుగై, ఆరోగ్యకరమైన అండాలు విడుదలవుతాయని వివరిస్తున్నారు. అలాగే, ప్రెగ్నెన్సీ సమయంలోనూ ఆరోగ్యంగా ఉండేందుకు, గర్భస్థ శిశువులో న్యూరల్ ట్యూబ్ ఎదుగుదలకు ఇవి దోహదం చేస్తాయంటున్నారు.

ఎముక బలానికి :

వయసు మీద పడుతున్న కొద్దీ ఎముకల బలం తగ్గిపోతుంటుంది. ఇక మెనోపాజ్ దశలోకి అడుగుపెట్టిన మహిళల్లో ఆస్టియోపొరోసిస్ కారణంగా ఈ సమస్య మరింత తీవ్రమవుతుందంటున్నారు నిపుణులు. అయితే నానబెట్టిన నల్ల ఎండుద్రాక్షను రోజూ తినడం వల్ల వీటిలో అధికంగా ఉండే క్యాల్షియంను శరీరం సులభంగా గ్రహిస్తుందని చెబుతున్నారు. తద్వారా ఎముకల దృఢత్వం పెరుగుతుందని తెలియజేస్తున్నారు. టీనేజీ నుంచే నానబెట్టిన నల్ల కిస్మిస్‌లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల వృద్ధాప్యంలో ఎముకల సంబంధిత సమస్యలు రాకుండా జాగ్రత్తపడచ్చని వివరిస్తున్నారు.

మెరిసే చర్మానికి :

అందంగా మెరిసిపోవాలని చాలా మంది అమ్మాయిలు విశ్వ ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే, ఇందుకోసం బయట దొరికే సౌందర్య ఉత్పత్తులు వాడడం కంటే సహజసిద్ధమైన పదార్థాల్ని తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. అందుకే, రోజువారీ ఆహారంలో బ్లాక్ కిస్మిస్‌లను చేర్చుకోవడం మంచిదని చెబుతున్నారు. వీటిని రోజూ నానబెట్టి తీసుకోవడం వల్ల చర్మం ప్రకాశవంతంగా మారుతుందని అధ్యయనం పేర్కొంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, పాలీఫినోల్స్ అనేవి ఫ్రీరాడికల్ డ్యామేజ్ నుంచి చర్మాన్ని కాపాడి వృద్ధాప్య ఛాయలు దరిచేరకుండా చేస్తాయట. అలాగే, విటమిన్ 'సి' కొలాజెన్ ఉత్పత్తిని పెంచి చర్మానికి మెరుపును తీసుకొస్తుందని పేర్కొంటున్నారు.

ఎన్ని తినాలి :

వీటితో పాటు జీర్ణశక్తిని మెరుగుపరచడానికి, తక్షణ శక్తికి, గుండె ఆరోగ్యానికి, రోగనిరోధక శక్తికి, బరువును అదుపులో ఉంచుకోవడానికి.. నానబెట్టిన బ్లాక్ కిస్మిస్‌తో ఆరోగ్యపరంగా చాలా ప్రయోజనాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. అలాగని వీటిని అమితంగా తీసుకోవడమూ మంచిది కాదంటున్నారు. రోజూ రాత్రి పడుకొనే ముందు 6 నుంచి 10 బ్లాక్ కిస్‌స్‌లను అరకప్పు నీటిలో నానబెట్టి మరుసటి రోజు ఉదయాన్నే పరగడపున అవి తిని.. ఆ నీటిని తాగితే ఈ ఆరోగ్య ప్రయోజనాలన్నీ సొంతమవుతాయని సూచిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# స్త్రీల మెదడుపై ఎఫెక్ట్ చూపిస్తున్న లింగ వివక్ష.. ఏకంగా నాలుగు దశల్లో..

## లింగ వివక్ష అనేది బాల్యం నుంచే పిల్లల మెదడులోకి ఎక్కిస్తుంది సొసైటీ. దీని కారణంగా మగాళ్లు అంటే బలం.. ఆడాళ్లు అంటే బలహీనతగా వివరించబడుతుంది.



ఇండియాలో లింగ వివక్ష అనేది డప్పు కొట్టి ప్రకటించబడదు. సైలెంట్‌గా వచ్చేస్తుంది. బ్రెయిన్‌లోకి ఎక్కేస్తుంది. డిన్నర్ టైంలో నీ పక్కన కూర్చుని.. 'ఇంత వయసొచ్చింది ఇంకా ఎందుకు పెళ్లి చేసుకోలేదు?' అని అడుగుతుంది. స్కూల్‌లో అబ్బాయిల ఆత్మవిశ్వాసం గురించి పొగుడుతూ.. అమ్మాయిల విధేయత గురించి ప్రశంసిస్తుంది. ఆఫీసులో స్త్రీలు రెట్టింపు పని చేసి.. కాస్త ఫైర్ అయినా.. మీరు చిరునవ్వుతోనే ఉండాలని చెప్తుంది. కాలక్రమేణా అది బయటి సమస్యగా కాకుండా మనసులోనే పెద్ద సమస్యగా మారిపోయి పాతుకుపోతుది. అందుకే సెక్సిజం కేవలం సామాజిక ఇబ్బంది మాత్రమే కాదు మెంటల్ కండిషనింగ్ సిస్టమ్ అంటున్నారు నిపుణులు. బ్రెయిన్ పదే పదే ఇలాంటి సంఘటనలకు ఎక్స్‌పోజ్ అయిన కారణంగా.. దానికి అనుగుణంగా మారిపోతుంది. కాగా ఇక్కడ భారత స్త్రీల మెదడును సైలెంట్‌గా కంట్రోల్ చేసే నాలుగు దశలు ఉన్నాయని చెప్తున్నారు ఎక్స్‌పర్ట్స్.

ప్రారంభంలో మెంటల్ కండిషనింగ్

సరిగ్గా కూర్చో.. గట్టిగా మాట్లాడకు.. చీకటి పడితే బయట ఉండకు.. వేరేవాళ్ల దృష్టిని ఆకర్షించకు.. పుట్టిన ఆడపిల్లలు తమ పేరును కూడా నేర్చుకోకముందే ఈ లింగ వివక్ష పరిచయమవుతుంది. డెవలప్‌మెంటల్ సైకాలజీలో దీన్ని జెండర్డ్ కండిషనింగ్ అంటారు. ఇది చిన్నతనం నుండే మొదలవుతుంది. ఎదిగే వయసులో పదే పదే వినిపించే ఈ మాటలు సురక్షితత్వం, విలువ, గుర్తింపు గురించిన కోర్ నమ్మకాలను రూపొందిస్తాయి. అబ్బాయిలను కొత్తగా అన్వేషించమని ప్రోత్సహిస్తే.. అమ్మాయిలను సెల్ఫ్ రిస్ట్రిక్ట్ చేయమని నేర్పిస్తాయి. అమెరికన్ సైకాలజికల్ అసోసియేషన్ ప్రచురించిన పరిశోధన ప్రకారం.. అమ్మాయిలు అబ్బాయిల కంటే ముందుగా ఈ భయాన్ని ఇంటర్నల్‌గా ఇముడ్చుకుంటారు. భారతదేశంలో ఈ కండిషనింగ్ మరింత తీవ్రంగా ఉంటుంది. అమ్మాయిలకు వారి ప్రవర్తనపైనే సెక్యూరిటీ ఆధారపడి ఉంటుందని నేర్పిస్తారు. ఏదైనా తప్పు జరిగితే.. 'ఆమెకు ఏమైంది?' అని అడగరు. ఆ సమయంలో ఎలాంటి బట్టలు వేసుకుంది? ఎక్కడికి వెళ్లింది? ఎందుకు ఒంటరిగా ఉంది? అని అడుగుతారు. న్యూరాలజికల్‌గా.. ఇది హైపర్‌విజిలెన్స్‌ను క్రియేట్ చేస్తుంది. మెదడులో భయానికి కేంద్రమైన అమిగ్డాలా అతిగా యాక్టివ్ అవుతుంది. దీని ఫలితంగా అమ్మాయిల్లో దీర్ఘకాలిక ఆందోళన, రెండోసారి ఆలోచించడం, పర్యావరణాన్ని నిరంతరం స్కాన్ చేయడం వంటి అలవాటు వచ్చేస్తుంది. చాలా మంది భారతీయ మహిళలు పబ్లిక్ స్పేస్‌లలో రిలాక్స్ కాలేరు ఎందుకంటే వారి బ్రెయిన్‌కు పబ్లిక్ స్పేస్‌లు వారికి చెందినవని ఎవరూ చెప్పలేదు. అదో ప్రమాదకరమైన స్థలంగానే పరిగణిస్తారు.

వాచ్ మెన్ అయిపోవడం

సంవత్సరాల తరబడి ఇలా ఉండాలి అలా ఉండకూడదు అని తీర్పు చెప్పబడడం.. సరిచేయబడడం.. హెచ్చరించబడడంతో.. మహిళలు ఒక ప్రమాదకరమైన మెంటల్ ట్రిక్ నేర్చుకుంటారు. తమను తాము ఒకటికి పదిసార్లు చూసుకోవడం మొదలుపెడతారు. దీన్ని ఇంటర్నలైజ్డ్ సెల్ఫ్ సర్వైలెన్స్ అంటారు. దుస్తుల నుంచి మొదలుపెడితే ఆశయాలు వరకు.. ఎలా నవ్వాలి నుంచి స్టార్ట్ చేస్తే ఎవరితో స్నేహం చేయాలనే నిర్ణయం వరకు.. కోపం వచ్చినా సరే ఎక్స్‌ప్రెస్ చేస్తే బాగుంటుందా లేదా అని ఆలోచించడం వరకు.. ప్రతిదీ మానిటర్ చేసుకుంటారు. ప్రపంచం వేలెత్తి జడ్జ్ చేయకముందే.. తమను తాము ఎడిట్ చేసుకుంటారు. ఇది ఎప్పుడూ ఆఫ్ కాని ఓ అంతర్గత జఋఒ కెమెరా లాంటిది. ప్రముఖ సైకాలజిస్ట్ దీన్ని మహిళలు తమకు తాము ఓ బయటి వ్యక్తిగా చూసుకోవడం.. నిరంతరం ఇతరులకు ఎలా కనిపిస్తున్నారో అంచనా వేయడంగా చెప్తున్నారు. కాగా ఈ పద్ధతి చాలా మంది భారతీయ మహిళల్లో ఇంపోస్టర్ సింద్రోమ్‌కు దారితీస్తుంది. అంటే ఓ పని చేస్తే కచ్చితంగా సక్సెస్ అవుతారని తెలిసినా.. బయటి వ్యక్తులు ఏమనుకుంటారోననే సంకోచం ఎదురవుతుంది.

అడ్జస్ట్‌మెంట్.. ఒకే ఒక్క థెరపీ

ఇంట్లో అడ్జస్ట్ అవ్వు... పెళ్లి విషయంలో సర్దుకుపో... కంఫర్ట్ లేకపోయినా వర్క్ చేయు.. అబ్యూజ్మెంట్ జరిగినా సైలెంట్ అయిపో.. ఇవి అమ్మాయిలకు వినిపించే మాటలు. అంటే భారతీయ మహిళలు ఒక శక్తివంతమైన పదం వింటూ పెరుగుతారు.. అదే అడ్జస్ట్‌మెంట్. న్యూరోసైన్స్ ప్రకారం ఈ అడ్జస్ట్మెంట్ అనేది.. దీర్ఘకాలిక భావోద్వేగ అణచివేత. కాగా ఇది కార్టిసాల్ స్థాయిలను పెంచుతుంది. మెమరీ, భావోద్వేగ నియంత్రణ కేంద్రమైన హిప్పోకాంపస్‌ను దెబ్బతీస్తుంది. ఫలితంగా బ్రెయిన్ ఫాగ్, భావోద్వేగ నిస్సారత, మోటివేషన్ లేకపోవడం.. నిరంతర ఓవర్‌వెల్మ్ భావన వస్తాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకారం... భారతీయ మహిళలు పురుషుల కంటే దాదాపు రెండు రెట్లు డిప్రెషన్‌కు గురవుతారు. కానీ సహాయం కోరే అవకాశం చాలా తక్కువ.

సంస్థలు సెక్సిజాన్ని ఎలా సపోర్ట్ చేస్తాయి

సెక్సిజం వ్యక్తిగత వైఖరులపై మాత్రమే బతకదు. కాగితంపై న్యూట్రల్‌గా కనిపించే.. ప్రాక్టీస్‌లో వివక్షపూరితంగా ఉండే సంస్థలు దీనికి మద్దతు ఇస్తాయి. కార్యాలయంలో చట్టం టెక్నలాజికల్‌గా ఉంది. కానీ సైకాలజీ వేరే కథ చెబుతుంది. 1997లో విశాఖ గైడ్‌లైన్స్, 2013లో ౧ాూాఒ యాక్ట్ మహిళలకు సురక్షితమైన ప్రొఫెషనల్ వాతావరణాన్ని సృష్టించడానికి ఉద్దేశించబడ్డాయి. కాగితంపై ఈ చట్టాలు ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీలు, నిర్దిష్ట సమయంలో పరిష్కారాన్ని ఇవ్వాలని ఆదేశిస్తాయి. కానీ చాలా మంది మహిళలు రిటాలియేషన్ భయం, క్యారెక్టర్ అసాసినేషన్, డిఫికల్ట్ అని లేబుల్ చేయబడే భయంతో హ్యారస్‌మెంట్‌ను రిపోర్ట్ చేయరు. మెదడు ఈ రిస్క్‌ను స్పష్టంగా అంచనా వేస్తుంది. సర్వైవల్ జస్టిస్ కంటే ఈ భయం వెంటాడుతుంది. అంతెందుకు భారతదేశంలో మ్యారిటల్ రేప్ ఇంకా నేరంగా గుర్తించబడలేదు. ఎందుకంటే చట్టం వివాహంతో ఫుల్ పర్మిషన్ ఇస్తుందనే ఫీలింగ్ ఇంకా ఉంది. '× ఎశీ' అనేది లైఫ్ టైమ్ పర్మిషన్ స్లిప్ లాంటిది. ఈ చట్టపరమైన బ్లైండ్ స్పాట్ ప్రైమరీ సైకాలజీని విస్మరిస్తుంది. నిజానికి సమ్మతి ఒక్కసారి జరిగే సంఘటన అవుతుందా భయం, ఒత్తిడి, బాధ్యతతో చేసే ఇంటిమసీ.. ఇంటిమసీ అవుతుందా? అది ఒక ట్రామా.

ప్రెషర్ కుకర్ ఎఫెక్ట్

నిజానికి దీన్ని భారతీయ మహిళలు నేర్చుకున్న 'ప్రెషర్ కుకర్ ఎఫెక్ట్' అని పిలవచ్చు. లోపలి భావోద్వేగాలను లోపలే ఉంచమని.. గట్టిగా మూత పెట్టమని.. ఫ్లేమ్‌ను అడ్జస్ట్ చేయమని.. చిరునవ్వుతో ఉండమని నేర్పించడం ఇది. కానీ మన చుట్టూ ఉన్నవారు విజిల్ కోసం ఎదురుచూస్తూ ఉంటారు చివరికి అది వస్తే.. ఎందుకు ఇంత ఎమోషనల్‌గా ఉన్నావు అంటారు. నిజానికి ఇది ఓవర్ రియాక్ట్ కాదు. నరాల వ్యవస్థ చిన్నప్పటి నుంచి శిక్షణ పొందిన విధంగానే స్పందిస్తుంది.

# హోమ్ లోన్ పూర్తైనా బ్యాంకులు ఆస్తి పత్రాలు తిరిగి ఇవ్వలేదా

# రోజుకు రూ.5వేలు పరిహారం పొందొచ్చు!

## - లోన్ క్లియర్ చేసిన 30 రోజుల్లోపు తనఖా పెట్టిన పత్రాలు తిరిగి ఇవ్వాలని ఆర్బీఐ రూల్స్- లేని పక్షంలో ఫైన్ కట్టాల్సిందే!

సొంతిల్లు అనేది ప్రతీ ఒక్కరి కల. ఈ కలను సాకారం చేసుకునేందుకు ఎంతగానో కష్టపడుతుంటారు. అయితే, సంపాదించిన డబ్బులు సరిపోక చాలా మంది హోమ్‌లోన్స్‌పై ఆధారపడుతుంటారు. ఈ మేరకు బ్యాంకులు లేదా ఫైనాన్స్ సంస్థల నుంచి కొంత మొత్తాన్ని అప్పుగా తీసుకుని నెలనెలా కొంత డబ్బు చెల్లిస్తుంటారు. అయితే, హోమ్ లోన్ క్లియర్ అయిన తర్వాత కూడా బ్యాంకులు కొన్ని పత్రాలను అందజేయడానికి కాస్త టైమ్ తీసుకుంటాయి. కానీ మీకు తెలుసా రూల్స్ ప్రకారం లోన్ క్లియర్ చేసిన 30 రోజుల్లోపు పత్రాలను కస్టమర్‌కు తిరిగి ఇవ్వాలి. అలా ఇవ్వని పక్షంలో బ్యాంక్ పెనాల్టీ కట్టాల్సి వస్తుంది. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం. హోమ్ లోన్ తీసుకునే ముందు తాకట్టు కింద బ్యాంకులు కొన్ని పత్రాలను తీసుకుంటాయి. మీరు ఏయే పత్రాలను సమర్పించారో లోన్ మంజూరు సమయంలో బ్యాంకు వాటి వివరాలను మీకు తెలియజేస్తుంది. లోన్ క్లోజ్ చేయగానే అవన్నీ బ్యాంకు నుంచి తీసుకోవాలి. ఏ ఒక్కదాన్నీ బ్యాంకులు లేదా ఫైనాన్స్ కంపెనీలు అట్టిపెట్టుకునే అధికారం లేదు. దీనికి సంబంధించి 2023లో నిర్దిష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది ఆర్బీఐ.

టైమ్ లిమిట్ దాటితే పరిహారం : దాని ప్రకారం.. లోన్ పూర్తిగా చెల్లించిన 30 రోజుల తర్వాత కస్టమర్ ఆస్తి పత్రాలను (చర లేదా స్థిరాస్తుల పత్రాలు) తిరిగి ఇవ్వడంలో లేదా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఛార్జ్ తొలగింపు ఫారమ్ దాఖలు చేయడంలో ఆలస్యం జరిగితే, ఆ ఆలస్యానికి గల కారణాలను =జు (రెగ్యులేటెడ్ ఎంటిటీ - అంటే బ్యాంక్ లేదా ఫైనాన్స్ సంస్థ) కస్టమర్‌కు తెలియజేయాలి. ఒకవేళ ఆ ఆలస్యం బ్యాంకు నిర్లక్ష్యం వల్ల జరిగితే, ఆలస్యమైన ప్రతి రోజుకూ ₹5,000 చొప్పున కస్టమర్‌కు పరిహారం చెల్లించాలి. ఉదాహరణకు మీరు జనవరి 20 తేదీన లోన్ క్లియర్ చేశారని అనుకుంటే ఫిబ్రవరి 18వ తేదీలోపు బ్యాంకులు మీ పత్రాలను తిరిగి ఇవ్వాలి. అలా జరగని పక్షంలో ఫిబ్రవరి 19 నుంచి రోజుకు రూ.5వేల చొప్పున జరిమానా వర్తిస్తుంది. ఈ రూల్ డిసెంబర్ 1, 2023 తర్వాత లోన్ క్లోజ్ అయిన అన్ని కేసులకూ వర్తిస్తుంది. ఆస్తి పత్రాలు పోయినా: కేవలం సమయానికి అందించడమే కాకుండా చర, స్థిరాస్తి పత్రాలు పాక్షికంగా లేదా పూర్తిగా పోయినట్లయితే దాని బాధ్యత కూడా బ్యాంకులే చూడాలి. పరిహారం చెల్లించడంతోపాటు డూప్లికేట్ లేదా సర్టిఫైడ్ కాపీలను పొందడానికి అయ్యే మొత్తం ఖర్చును బ్యాంకే భరించాలి. ఈ ప్రక్రియలో కస్టమర్‌కు ఆర్థికంగా ఎటువంటి భారమూ పడకూడదు. డూప్లికేట్ పత్రాలను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి తెప్పించే మొత్తం ప్రక్రియకు బ్యాంక్ సహకరించాలి. అవసరమైన లీగల్ ఖర్చులను కూడా భరించాలి. అయితే పత్రాలు పోయినట్లు ధ్రువీకరించిన తర్వాత, డూప్లికేట్ పత్రాలు సేకరించడానికి బ్యాంకుకు అదనంగా 30 రోజుల(మొత్తం 60 రోజులు) సమయం లభిస్తుంది. ఈ 30 రోజులు దాటిన తర్వాత కూడా పత్రాలు అందించలేకపోతే, అప్పుడు ప్రతి రోజుకూ ₹5,000 చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఈ నిబంధన హోమ్ లోన్లతో పాటు కార్ లోన్లు, గోల్డ్ లోన్లు సహా అన్ని రకాల సెక్యూర్డ్ పర్సనల్ లోన్లకు వర్తిస్తుంది. కాగా లోన్ క్లియర్ అయిన తర్వాత బ్యాంకులు లేదా రుణ సంస్థలే మీకు డాక్యుమెంట్లు పంపాలని ఆశించొద్దు. మీరే స్వయంగా వెళ్లి తీసుకోవడం మంచిది. ఎందుకంటే పత్రాలన్నీ ఉన్నాయా వాటిలో ఏవైనా పేజీలు మిస్సయ్యాయా స్వయంగా చూసుకుంటేనే మేలు. లేదంటే మళ్లీ బ్యాంకుల చుట్టూ తిరగాల్సి ఉంటుంది. అలాగే పత్రాలన్నీ తీసుకున్నట్లు సంతకం చేసే ముందు ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవడం కూడా మర్చిపోకూడదు. ఒకవేళ ఏ బ్యాంకు అయినా ఈ 30 రోజుల గడువును పాటించకపోతే, కస్టమర్లు ఆ జరిమానా మొత్తాన్ని క్లెయిమ్ చేయవచ్చు. బ్యాంక్ సరైన సమాధానం ఇవ్వని పక్షంలో కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే హక్కు కస్టమర్‌కు ఉంటుంది.

# రైలు కింద తలపెట్టి టెక్కీ సూసైడ్..

# ఐటీ సెక్టార్ లో అసలేం జరుగుతోంది

## హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ లో మంగళవారం జరిగిన తరుణ్ అనే సాఫ్ట్ వేర్ ఇంజనీర్ ఆత్మహత్య ఘటన దేశవ్యాప్తంగా ఐటీ ఉద్యోగుల మెంటల్ హెల్త్ సమస్యలను మరోసారి ముందుకు తెచ్చింది.



హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ లో మంగళవారం జరిగిన తరుణ్ అనే సాఫ్ట్ వేర్ ఇంజనీర్ ఆత్మహత్య ఘటన దేశవ్యాప్తంగా ఐటీ ఉద్యోగుల మెంటల్ హెల్త్ సమస్యలను మరోసారి ముందుకు తెచ్చింది. వరంగల్‌కు చెందిన తరుణ్ హైదరాబాద్ లో సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పని చేస్తూ... భార్య, మూడేళ్ళ కూతురుతో నివసిస్తున్నాడు. బయటకు జీవితం సక్రమంగానే కనిపించినా, గత ఏడాది నుంచి మానసిక సమస్యలతో బాధ పడుతూ అందుకోసం చికిత్స తీసుకుంటున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన తరుణ్, ఖైరతాబాద్ రైల్వే గేట్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఒక్క ఘటన మాత్రమే కాదు, ఇటీవలి కాలంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ఆత్మహత్యలు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్నాయి. ఐటీ రంగంలో ఉద్యోగం మరీ అంత ఒత్తిడితో కూడుకొని ఉంటుందా అనే అనుమానాలు అందరిలోనూ రేకెత్తుతున్నాయి. గత ఐదారేళ్ళ వారీగా టెక్కీల సూసైడ్స్ గణాంకాలు చూస్తే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది.

గణాంకాలు చుస్తే కళ్ళు బైర్లు కమ్మాల్సిందే

2022లో భారతదేశంలో మొత్తం 1,71,000 మంది ఆత్మహత్యలు జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. మన దేశ జనాభాలో అంటే ప్రతి లక్ష మందికి 12.4 మంది సూసైడ్ చేసుకున్నారు. ఇది ప్రపంచ సగటు 9.2 కంటే చాలా ఎక్కువ. ఇందులో ఐటీ సెక్టర్‌కు ప్రత్యేకంగా పూర్తి డేటా లేకపోయినా.. 2017 నుంచి 2025 మధ్య కాలంలో 227 ఐటీ ఉద్యోగుల సూసైడ్ కేసులు రిపోర్ట్ అయ్యాయి. ముఖ్యంగా బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, పుణె వంటి ఐటీ హబ్‌లలో ఈ సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది. సర్వేలు చెబుతున్నదేమిటంటే, 83% ఐటీ ఉద్యోగులు తీవ్ర పని ఒత్తిడితో అలసిపోతున్నట్టు సమాచారం. అలాగే 25% మంది వారానికి 70 గంటలకుపైగా పని చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఒక స్టడీ ప్రకారం.. 84% ఐటీ ఉద్యోగుల్లో లివర్ సమస్యలు ఉన్నాయి. ఇవి స్ట్రెస్ తోపాటు ఎలాంటి శారీరక శ్రమ లేకపోవడం వల్ల వస్తున్నాయట. ఇక కర్ణాటకలో ఆర్గన్ ట్రాన్స్‌ప్లాంట్ కోసం ఎదురు చూస్తున్నవారిలో 20% ఐటీ ప్రొఫెషనల్స్ ఉండటం కూడా పరిస్థితి టెక్కీల్లో అనారోగ్య సమస్యలకు అద్దం పడుతోంది. మరో అధ్యయనం ప్రకారం, 51.2% ఐటీ ఇంజినీర్లు వర్క్ స్ట్రెస్‌తో, 36% మంది మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారట.

అనారోగ్యాలకు మూల కారణాలివే

వీరి అనారోగ్య సమస్యలకు కారణాలు చాలా ఉన్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ప్రపంచంలోనే అత్యధిక ఒత్తిడి ఉన్న ఉద్యోగాల్లో ఒకటిగా మారాయి. లాంగ్ వర్క్ అవర్స్, డెడ్‌లైన్స్, ఓవర్‌టైమ్, కంప్యూటర్ ముందు గంటల తరబడి కూర్చునే జీవనశైలి వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటోంది. కొన్ని ఐటీ వర్గాల్లో 7090 గంటల వర్క్ వీక్ కూడా చాలా కామన్ అయింది. ఇక టెక్కీలను వెంటాడే మరో పెద్ద సమస్య జాబ్ ఇన్‌సెక్యూరిటీ. ౧ా×, ఆటోమేషన్ వల్ల 2025లోనే 6,000కుపైగా లేఆఫ్స్ జరిగాయి. ప్రతి సంవత్సరం దేశంలో సుమారు 15 లక్షల ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్ బయటకు వస్తే, అందులో కేవలం 10% మందికే సరైన ఉద్యోగాలు దొరుకుతున్నాయి. దీనితో పాటు మెంటల్ హెల్త్‌పై మాట్లాడటం ఇంకా ఒక స్టిగ్మాగా ఉంది. ఉద్యోగంలో ఒత్తిడి, వేధింపులు, జీతాల ఆలస్యం, కుటుంబ సమస్యలు.. ఇవన్నీ కలిసి డిప్రెషన్‌ను పెంచుతున్నాయి. కోవిడ్ తర్వాత వర్క్‌లైఫ్ బౌండరీలు పూర్తిగా చెరిగిపోయాయి. ఇంటి నుంచి పని చేయడం వల్ల పని సమయం, విశ్రాంతి సమయం అనే తేడా లేకుండా పోయింది. ఒంటరితనం, మద్యం అలవాటు, ఇతర అడిక్షన్లు కూడా సమస్యను మరింత పెంచుతున్నాయి.

డేంజర్ జోన్లో హైదరాబాద్

హైదరాబాద్‌లోనే 2026 జనవరిఫిబ్రవరి మధ్య జరిగిన ఘటనలు చూస్తే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తుంది. ఫిబ్రవరి 2026లో ఖైరతాబాద్‌లో వై.తరుణ్ (30) రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకున్నాడు. జనవరి 31న నెలలో మియాపూర్ ప్రాంతంలో సతీష్ (31) అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తీవ్ర వర్క్ ప్రెషర్ వల్ల ఇంట్లో ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. సైనిక్‌పూరిలో సుందరమూర్తి అనే ఐటీ ఉద్యోగి గూడ్స్ ట్రైన్ ముందు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. జనవరిలో పి. విజయ రెడ్డి(38) తన ఇద్దరు టీనేజ్ పిల్లలతో కలిసి రైలు ముందు దూకి సూసైడ్ ప్యాక్ట్ చేసుకోవడం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. ఇలాంటి కేసులు ఇంకా చాలానే ఉన్నాయి. ఇవన్నీ ఒక్క వారి కుటుంబాన్ని మాత్రమే కాదు, మొత్తం సమాజాన్ని కుదిపేస్తున్నాయి.

కంపెనీల తక్షణ చర్యలు అవసరం

ఈ పరిస్థితిని మార్చాలంటే ఐటీ రంగంలో కొన్ని తక్షణ చర్యలు అవసరం. కంపెనీలు ఉద్యోగుల కోసం మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్స్, ఎంప్లాయీ అసిస్టెన్స్ ప్రోగ్రామ్స్‌ద వర్క్‌లైఫ్ బ్యాలెన్స్, "రైట్ టు డిస్‌కనెక్ట్" లాంటి పాలసీలు తక్షణమే అమలు చేయాలి. ప్రభుత్వం లేబర్ క్లాజ్‌లను కఠినంగా అమలు చేయాలి. మెంటల్ హెల్త్ డేటాను సేకరించి, నేషనల్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్‌ను బలంగా అమలు చేయాలి. వ్యక్తిగతంగా, స్ట్రెస్‌ను దాచుకోకుండా, ఫ్రెండ్స్‌తో మాట్లాడటం, అవసరమైతే ప్రొఫెషనల్ హెల్ప్ తీసుకోవడం చాలా ముఖ్యం. మెంటల్ హెల్త్‌పై ఉన్న స్టిగ్మాను తగ్గించి, అవేర్‌నెస్ పెంచాలి. ఐటీ సెక్టర్ మన దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక పెద్ద ఆర్థిక వనరు. కానీ ఆ రంగాన్ని నడిపించే మనుషులు కూడా ముఖ్యమే. ఇటీవల జరుగుతున్న వరుస టెక్కీల సూసైడ్ ఘటనలు మొత్తం మానవ సమాజానికి పెద్ద హెచ్చరిక. ఇప్పుడైనా మార్పు తీసుకురాకపోతే, ఈ "నిశ్శబ్ద మహమ్మారి" చాపకింద నీరులా చేరి ఇంకా ఎక్కువ ప్రాణాలు తీసే ప్రమాదం ఉంది.

# రెండో టీ20లో ఆసీస్ విజయం- పోరాడి ఓడిన టీమ్ఇండియా

## భారత మహిళల ఆస్ట్రేలియా పర్యటన- రెండో టీ20లో టీమ్ఇండియా ఓటమి- 1-1తో సిరీస్ సమం




ఆస్ట్రేలియా పర్యటనలో రెండో టీ20లో భారత్ మహిళల జట్టుకు ఓటమి ఎదురైంది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా కాన్‌బెర్రా వేదికగా గురువారం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. 164 పరుగుల ఛేదనలో టీమ్ఇండియా ఓవర్లన్నీ ఆడి 9 వికెట్లు కోల్పోయి 144 పరుగులే చేసింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (36 పరుగులు) టాప్ స్కోరర్. ఆసీస్ బౌలర్లలో అష్లీ గార్డ్ నర్ 3, కిమ్ గార్త్, అనబెల్ సుదర్లాండ్, సోఫీ తలో 2 వికెట్లు దక్కించుకున్నారు. ఛేదనను భారత్ ఘనంగానే ఆరంభించింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (29 పరుగులు, 23 బంతుల్లో), స్మృతి మంధాన (31 పరుగులు, 24 బంతుల్లో) మంచి ఆరంభమే ఇచ్చారు. తొలి వికెట్ కు ఈ ఇద్దరూ 50 పరుగులు జోడించారు. అయితే 6.4 వద్ద షఫాలీని సోఫీ ఔట్ చేసి ఆసీస్ కు బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత కాసేపటికే జెమిమా రోడ్రిగ్స్ (4 పరుగులు) స్వల్ప స్కోర్ కే పెవిలియన్ చేరింది. 10వ ఓవర్లో స్మృతి కూడా ఔట్ కావడంతో భారత్ సమం ఇన్నింగ్స్ ముగిసేలోపు 71 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది.

హర్మన్ ప్రయత్నించినా!

ఈ దశలో కెప్టెన్ హర్మన్ బాధ్యతగా ఆడింది. రిచా ఘోష్ (19 పరుగులు) తో కలిసి భాగస్వామ్యం నిర్మించే ప్రయత్నం చేసింది. ఈ ఇద్దరు మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుతూ జట్టును విజయం దిశగా నడిపించారు. దీంతో 16 ఓవర్లు ముగిసే సరికి టీమ్ఇండియా 123-3 తో నిలిచింది. హర్మన్, రిచా ఉండడంతో భారత్ విజయంపై ధీమాగా ఉంది. అప్పటికి భారత్ విజయానికి 4 ఓవర్లలో 44 పరుగులు కావాలి.

4 ఓవర్లలో 44 పరుగులు

17వ ఓవర్లో మూడో బంతికి హర్మన్ ఫోర్ బాదడంతో పార్ట్ నర్ షిప్ 50 పరుగులు కంప్లీట్ అయ్యింది. ఆ తర్వాతే ఆసీస్ గేరు మార్చింది. వరుస వికెట్లు తీసి భారత్ ను తీవ్రంగా దెబ్బకొట్టింది. అదే ఓవర్ ఐదో బంతికి హర్మన్ ను కిమ్ గార్త్ ఔట్ చేసింది. ఆ తర్వాత చివరి మూడు ఓవర్లలో 37 పరుగులు కావాలి. అయితే 18వ ఓవర్లో 3 పరుగులే రావడమే కాకుండా భారత్ రిచా, దీప్తి వికెట్లు కోల్పోయింది. దీంతో భారత్ ఓటమి దాదాపు ఖరారైపోయింది. ఆ తర్వాత 19వ ఓవర్లో రెండు, 20వ ఓవర్లో 1 వికెట్ పడింది. చివరి రెండు బంతులకు సిక్స్, ఫోర్ బాదిన క్రాంతి గౌడ్ ఓటమి అంతరాన్ని తగ్గించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. ఓపెనర్ జార్జియా వోల్ (88 పరుగులు) సూపర్ హాఫ్ సెంచరీతో మెరిసింది. బెత్ మూనీ (46 పరుగులు) రాణించింది. టీమ్ఇండియా బౌలర్లలో అరుంధతి రెడ్డి 2, రేణుకా సింగ్ ఠాకూర్ 1 వికెట్ పడగొట్టారు. తాజా విజయంతో మూడు టీ20ల సిరీస్ ను ఆసీస్ 1- 1తో సమం చేసింది. కాగా, తొలి టీ20లో విజయం సాధించిన టీమ్ఇండియా, రెండో మ్యాచ్ లోనూ నెగ్గి మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ పట్టేయాలని భావించింది.

# పత్తి రైతుకు 'తేమ' కష్టం.. మద్దతు ధరకు ప్రైవేటు 'కోతలు'!

పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 19 ఆకాంక్ష : పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి రైతుల పరిస్థితి రోజురోజుకు అగమ్యగోచరంగా మారుతోంది. ఆకాశమంత కష్టానికి అడుగడుగునా ఆంక్షలు ఎదురవుతుండటంతో అన్నదాతలు ఆందోళన బాట పట్టారు. ఒకవైపు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జజ×) కఠిన నిబంధనలు, మరోవైపు అదే పరిస్థితిని అదనుగా చేసుకుని ప్రైవేటు వ్యాపారుల ఇష్టారాజ్యం కొనసాగుతుండటంతో రైతులు భారీగా నష్టపోతున్నారు.తేమ శాతం పేరుతో రైతులపై మోపుతున్న భారమే ప్రస్తుతం పెద్దపల్లి యార్డులో ప్రధాన సమస్యగా మారింది. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తికి మద్దతు ధర దక్కాలంటే తేమ శాతం 8 నుండి 12 శాతం లోపు ఉండాలనే నిబంధన రైతులకు శాపంగా మారింది. వాతావరణ మార్పులు,కోతల తర్వాత నిల్వ సమస్యలు వంటి కారణాలతో రైతుల పత్తిలో తేమ శాతం ఎక్కువగా నమోదవుతుండటంతో మెజారిటీ రైతుల పత్తిని సీసీఐ తిరస్కరిస్తోంది.ఇదే పరిస్థితిని అవకాశంగా మార్చుకున్న ప్రైవేటు వ్యాపారులు 12 శాతం కంటే ఎక్కువ తేమ ఉందనే సాకుతో క్వింటాలుకు కేవలం ₹7,100 నుండి ₹7,500 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. అధికారికంగా మద్దతు ధర రూ.7,521 ఉండాల్సి ఉండగా, వ్యాపారుల సిండికేట్ కారణంగా రైతులకు క్వింటాలుపై వందల రూపాయల నష్టం వాటిల్లుతోంది. తేమ కొలతలో స్పష్టత లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపించడం వంటి కారణాలతో ప్రైవేటు వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఇంకా సమస్యను మరింత తీవ్రతరం చేస్తూ ఈ నెల 21వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రకటించారు. నాణ్యత ప్రమాణాలు తగ్గుతున్నాయనే కారణంతో తీసుకున్న ఈ నిర్ణయం రైతులను మరింత సంక్షోభంలోకి నెట్టింది. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇప్పటికే కొనుగోళ్లు నిలిపివేతకు సంబంధించిన ప్రకటన వెలువడటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో నిలిచిపోయారు.కొనుగోళ్లు నిలిపివేస్తే మార్కెట్ మొత్తం ప్రైవేటు వ్యాపారుల గుప్పిట్లోకి వెళ్లిపోతుందని, అప్పుడు ధరలు మరింత పడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఏడాది పాటు శ్రమించి పండించిన పత్తికి కనీస గిట్టుబాటు ధర కూడా రాకపోతే అప్పుల బారిన పడే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో రైతులు కొన్ని ప్రధాన డిమాండ్లు ముందుకు తెచ్చారు. సీసీఐ కొనుగోలు గడువును కనీసం మరో రెండు వారాల పాటు పొడిగించాలని, తేమ శాతం నిబంధనల్లో కొంత సడలింపు ఇచ్చి గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరలకు కొనుగోలు చేయకుండా మార్కెట్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.ప్రస్తుతానికి ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు సమస్యపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా రైతులు తమ వద్ద ఉన్న పత్తిని వెంటనే 'కాపాస్ కిసాన్' యాప్‌లో స్లాట్ బుక్ చేసుకుని మార్కెట్‌కు తరలించాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరికే వరకు పెద్దపల్లి యార్డులో పత్తి కొనుగోలు వ్యవస్థపై అనిశ్చితి కొనసాగుతూనే ఉంది.



## సమయపాలన పాటించని ఉపాధ్యాయులను

## వెంటనే సస్పెండ్ చేయాలి...

బీజేపీ, ఏబీవీపీ డిమాండ్..



జడ్చర్ల/ఫిబ్రవరి 19 ఆకాంక్ష : మిడ్జిల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని భారతీయ జనతా పార్టీ మిడ్జిల్ మండల శాఖతో పాటు ఏబీవీపీ నాయకులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పాఠశాలలో జరిగిన సంఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో బీజేపీ, ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు.గత మూడు సంవత్సరాల క్రితం సుమారు 550 మంది విద్యార్థులు ఉన్న మిడ్జిల్ హైస్కూల్‌లో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతూ వస్తోందని, విద్యార్థుల హాజరు శాతం కూడా పడిపోతుందని నాయకులు పేర్కొన్నారు. దీనికి ప్రధాన కారణం ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం, రాజకీయ ప్రలోభాలకు లోబడటం అని ఆరోపించారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఉండటంతో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివిస్తున్నారని, అయితే ఉపాధ్యాయులు తమ బాధ్యతలను నిర్వర్తించకపోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని, నాణ్యమైన బోధన అందించే ఉపాధ్యాయులను నియమించాలని, కాలయాపన చేస్తున్న మరియు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మిడ్జిల్ ప్రభుత్వ పాఠశాలను ఆదర్శవంతమైన పాఠశాలగా తీర్చిదిద్దాలంటే బాధ్యతాయుతంగా పనిచేసే ఉపాధ్యాయులను నియమించడం అత్యవసరమని నాయకులు స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులను కోరారు.ఈకార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పల్లె తిరుపతి, మిడ్జిల్ మండల అధ్యక్షులు నరేష్ నాయక్, ఏబీవీపీ నాయకులు శేఖర్, భారత్ గౌడ్, పి.శేఖర్, అజయ్, సందీప్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్చర్లలో ఛత్రపతి శివాజీ మహారాజ్

## 396వ జయంతి ఉత్సవాలు నిర్వహణ...



జడ్చర్ల//ఫిబ్రవరి 19 ఆకాంక్ష : జడ్చర్ల మున్సిపాలిటీలోని పాత బజార్‌లో గురువారం ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి జడ్చర్ల శాసనసభ్యులు శ్రీ జనంపల్లి అనిరుధ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే గారు శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం మహాదానం అని, ప్రతి యువకుడు సమాజ సేవలో భాగంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.శివాజీ మహారాజ్ దేశభక్తి, ధైర్యసాహసాలు, పరిపాలనా దక్షత యువతకు ఆదర్శమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వారి ఆశయాలు, త్యాగస్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. మహనీయుల జయంతులను సమాజ సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, యువత, భక్తులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా

## కలిసిన రామగుండం మేయర్...



గోదావరిఖని టౌన్//ఫిబ్రవరి 19 ఆకాంక్ష : పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షను గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో నూతనంగా ఎంపికైన రామగుండం మేయర్ మహంకాళి స్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య కూడా హాజరయ్యారు. నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై కలెక్టర్‌తో మేయర్, డిప్యూటీ మేయర్ చర్చించారు. రామగుండం నగర అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని కలెక్టర్‌ను కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మున్సిపల్ యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుందని మేయర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎండీ. ముస్తఫా, గట్ల రమేష్, వడ్లూరి రవి, గడ్డం రమ శ్రీనివాస్, చిదురాల నాగరాజు, ధూళికట్ట సతీష్ పాల్గొన్నారు. అలాగే నాయకులు దాసరి విజయ్, అజయ్ సింగ్, కుడిదెల శివ, కారెంగుల సురేష్, సన్నీ, గుడికందుల రవి, రాహుల్ తదితరులు హాజరయ్యారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు...



జడ్చర్ల/ఫిబ్రవరి 19 ఆకాంక్ష : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా జడ్చర్ల పరిధిలోని మిడ్జిల్ మండల కేంద్రంలో శివాజీ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఛత్రపతి శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, యువకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ముందుగా శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలను, ధైర్య సాహసాలను స్మరించుకుంటూ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షులు పల్లె తిరుపతి మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ మహారాజ్ ఒక వ్యక్తి మాత్రమే కాదని, ఆయన శక్తి స్వరూపుడని పేర్కొన్నారు. శివాజీ ఆశయాలను ప్రతి గ్రామ గ్రామానకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి ఒక్కరిలో హైందవ చైతన్యం పెంపొందాలని, సమాజంలో ఐక్యత, ధైర్యం, సేవాభావం పెరగాలని పిలుపునిచ్చారు.హైందవ సామ్రాజ్య స్థాపన కోసం శివాజీ కత్తి పట్టి యుద్ధం చేసినప్పటికీ, నేటి యువతకు ఆయుధాలతో యుద్ధం చేయాల్సిన అవసరం లేదని, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ దేశాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. యువత శివాజీ స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. రాజేశ్వర్, బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్ నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ వట్టెం భీమయ్య, నాయకులు పట్నం జంగయ్య, అంజి, అరవింద్, కావలి నరేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. యువజన సంఘ నాయకులు వడ్డే నవీన్, అజయ్, శేఖర్, బాజీ, సిద్దు, వెంకటేష్ తదితర యువకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అంగన్వాడీల న్యాయ డిమాండ్ల

## కోసం 23 నుండి రిలే నిరాహార దీక్షలు...



వెల్దుర్తి//ఫిబ్రవరి 19 ఆకాంక్ష : అంగన్వాడీ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23 నుండి 27వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా సీడీపీఓ కార్యాలయాల ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ అనుబంధ అంగన్వాడీ రాష్ట్ర సమితి నాయకులు ప్రకటించారు.27వ తేదీన "చలో కలెక్టరేట్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ మేరకు గురువారం కర్నూలు జిల్లా పీడీ కి ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి జె.లలితమ్మ, సీఐటీయూ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చౌడేశ్వరి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మునెప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పి.ఎస్. రాధాకృష్ణ, నగర నాయకులు నాగేష్, విజయ్, రఫీ తదితరులు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జె.లలితమ్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తున్నా జీతాల పెంపు, ఇతర సమస్యల పరిష్కారంపై స్పష్టమైన చర్యలు తీసుకోవడం లేదని ఆమె అన్నారు.అంగన్వాడీ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 23 నుండి రాష్ట్రంలోని అన్ని సీడీపీఓ కార్యాలయాల ముందు రిలే నిరాహార దీక్షలు నిర్వహించి, 27న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. ఈలోపు సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే నెల 2వ తేదీన "చలో విజయవాడ" కార్యక్రమాన్ని నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు.ద

## ఘనంగా శ్రీ శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు...



నాగర్‌కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 19 ఆకాంక్ష : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండల కేంద్రంలో శ్రీ శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటగా ఎమ్మెల్యే సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ సమాజ సేవకు అంకితభావంతో పనిచేసిన మహానుభావుడని కొనియాడారు. ఆయన బోధనలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, సేవాభావం పెంపొందించుకోవాలని, యువత సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. వివిధ గిరిజన తండాల్లోనూ బైక్ ర్యాలీలు నిర్వహించి తమ ఐక్యతను చాటుకున్నారు. తండాలలో జెండాలు, ఎజెండాలు, రాజకీయాలకు అతీతంగా బంజారా సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. "మేమంతా శ్రీ శ్రీ సంతు సేవాలాల్ మహారాజు ముద్దుబిడ్డలం" అంటూ నినాదాలు చేస్తూ ఐక్యతను ప్రదర్శించారు.



కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ, ఉషోర్ కమిటీ హన్య నాయక్, గౌరవ అధ్యక్షులు మాన్య నాయక్, గోవిందు నాయక్, పుల్య నాయక్, గోపాల్ నాయక్, రామచంద్ర నాయక్, చంద్ర నాయక్, లక్ష్మణ్ నాయక్, కృష్ణ నాయక్ తదితర స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ తండాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, లంబాడి గిరిజన సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొనడం ద్వారా "పార్టీలు వేరైనా మనం అందరం ఒకటే" అనే సందేశం అందించారు. లంబాడి సాంప్రదాయ వేషధారణలో పాల్గొన్న గిరిజనులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మండలంలోని బంజారా సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ వేడుకలను విజయవంతం చేశారు.

## ల్యాబ్ టెక్నీషియన్‌లకు ఇండక్షన్ శిక్షణ...




పెద్దపల్లిటౌన్/ఫిబ్రవరి 19 ఆకాంక్ష : పెద్దపల్లి జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కొత్తగా నియమితులైన ల్యాబ్ టెక్నీషియన్‌లకు ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా అధికారుల కార్యాలయ సముదాయ భవనంలోని (ఐడీఓసీ) మినీ సమావేశ మందిరంలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది.ఈ శిక్షణలో భాగంగా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన వివిధ డయాగ్నొస్టిక్ పరీక్షలను నిర్వహించే విధానం, రికార్డుల నిర్వహణ, నాణ్యమైన రిపోర్టులు అందేలా రక్త పరీక్షలు చేయడం, రక్త నమూనాలను సక్రమంగా సేకరించడం మరియు వాటిని తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రానికి సమయానికి, సరైన విధంగా పంపించే ప్రక్రియలపై సవివరంగా అవగాహన కల్పించారు.ప్రత్యేకంగా ల్యాబ్ టెక్నీషియన్‌లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకునే విధంగా శిక్షణ ఇచ్చారు. రికార్డ్స్ మెయింటెనెన్స్, రక్త నమూనాల సేకరణ, పరీక్షల నాణ్యత ప్రమాణాల పరిరక్షణ వంటి అంశాలపై మార్గదర్శకాలు అందించారు.ఈ సందర్భంగా డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, ల్యాబ్ టెక్నీషియన్‌లు ప్రజల ఆరోగ్య భద్రతలో కీలక పాత్ర పోషిస్తారని, వారి సేవలు నాణ్యమైన వైద్య సేవల అందుబాటుకు బలమైన ఆధారమని పేర్కొన్నారు. ప్రతి నివేదిక ఖచ్చితత్వం, నాణ్యతతో ఉండేలా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో పాటు ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి. రాజమౌళి, డాక్టర్ బి. కిరణ్ కుమార్, ఇన్‌చార్జి ఏఎంఓ ఉమా మహేశ్వర్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్ మరియు ఇతర ల్యాబ్ టెక్నీషియన్‌లు పాల్గొన్నారు.

## ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శిగా

## పూసాల తిరుపతి నియామకం..



గోదావరిఖని/ఫిబ్రవరి 19 ఆకాంక్ష : జాతీయ కార్మిక సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కార్యదర్శిగా రామగుండం ప్రాంతానికి చెందిన పూసాల తిరుపతిని నియమించినట్లు జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి. సంజీవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక హక్కుల పరిరక్షణ, కార్మిక సంక్షేమం కోసం కృషి చేసే నాయకత్వానికి ప్రాధాన్యతనిస్తూ ఈ నియామకం చేపట్టినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా పూసాల తిరుపతి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఉమ్మడి రాష్ట్రాల కార్యదర్శిగా నియమించినందుకు డాక్టర్ జి. సంజీవరెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్ర ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శులు ఆర్.డి. చంద్రశేఖర్, వి. భాస్కర్ రెడ్డి మరియు నాయకులు జనక్ ప్రసాద్, బాబర్ సలీం పాషా, సత్యజిత్ రెడ్డి, విజయ్ కుమార్ యాదవ్, నాగన్న గౌడ్‌లకు తన ధన్యవాదాలు తెలిపారు.కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం శ్రమిస్తూ సంస్థను మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉంటానని పూసాల తిరుపతి తెలిపారు. కార్మిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని ఆయన పేర్కొన్నారు.

## ఓదెల మల్లికార్జున స్వామి ఆలయాన్ని

## సందర్శించిన ఎన్‌హెచ్‌ఏఐ సభ్యులు రాజేంద్ర కుమార్...




ఓదెల//ఫిబ్రవరి 19 ఆకాంక్ష : పెద్దపల్లి జిల్లాలోని ప్రఖ్యాత ఓదెల మల్లికార్జున స్వామి దేవాలయంను రాజేంద్ర కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ఆయనకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి. అనిల్ రెడ్డి ఆత్మీయ స్వాగతం పలికి ఆలయ ప్రాంగణానికి తీసుకువెళ్లారు.దేవాలయ చైర్మన్ మరియు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి రాజేంద్ర కుమార్‌ను సన్మానించారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి దర్శనం పొందారు.తదుపరి ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించిన రాజేంద్ర కుమార్, భక్తులకు అందుబాటులో ఉండే సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, రహదారి సౌకర్యాలు తదితర అంశాలపై అధికారులకు విలువైన సూచనలు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా అవసరమైన మౌలిక వసతులను మెరుగుపర్చాలని సూచించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ శ్రీ మెండయ్య, ఓదెల సర్పంచ్ కె. సతీష్, అబ్బిడిపల్లి సర్పంచ్ నర్సింహ రెడ్డి, ఆలయ అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పత్తి రైతులు ఆందోళన చెందవద్దు...

ఎంపీ గడ్డం వంశీకృష్ణ...




పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 19 ఆకాంక్ష : పెద్దపల్లి జిల్లాలో పత్తి కొనుగోళ్ల అంశంపై రైతులు ఆందోళన చెందవద్దని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ రైతులకు భరోసా కల్పించారు. గత కొన్ని రోజులుగా పత్తి కొనుగోళ్లపై ఏర్పడిన అనిశ్చితి కారణంగా రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్న నేపథ్యంలో, కొనుగోళ్లకు గడువు పొడిగింపునకు కేంద్ర సంస్థలతో చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు.ఇటీవల చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్‌తో మాట్లాడి, రైతుల సమస్యలను వివరించినట్లు ఎంపీ పేర్కొన్నారు. ప్రస్తుత కొనుగోలు గడువు ఫిబ్రవరి 20తో ముగియనుండగా, కొనుగోళ్లు నిలిపివేయకుండా మార్చి 15 వరకు పొడిగించాలని అధికారికంగా అభ్యర్థించామని తెలిపారు.ముఖ్యంగా చెన్నూర్ నియోజకవర్గంలోని కోటపల్లి ప్రాంతంలో పత్తి ఫ్యాక్స్ ఫిగర్లు ఆలస్యంగా నమోదు అవుతున్న సమస్యను జజ× అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన వివరించారు. ఆ ప్రాంతానికి ప్రత్యేకంగా కొనుగోలు ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలని కూడా కోరినట్లు చెప్పారు.ఈ అంశంపై త్వరలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని జజ× అధికారులు హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం తాను నిరంతరం కృషి చేస్తానని, అవసరమైతే మరింతగా పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.పత్తి రైతులు ఎటువంటి ఆందోళనకు గురి కాకుండా, ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై విశ్వాసంతో ఉండాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ సూచించారు. జిల్లాలో పత్తి కొనుగోళ్ల ప్రక్రియను నిరంతరంగా కొనసాగించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## విద్యార్థి దశ నుండే సామాజిక స్పృహ అవసరం..



నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 19 ఆకాంక్ష : బాల్యం నుండే పిల్లలకు సామాజిక బాధ్యత, స్పృహ,సామాజిక చైతన్యం అలవర్చుకోవడం ఎంతో అవసరమని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీ జీ. జానకి రాములు పేర్కొన్నారు. గురువారం నాగర్ కర్నూల్ పట్టణంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు తమ వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధి కోసం కూడా కృషి చేయాల్సిన బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. సమాజంలోని సమస్యల పట్ల విద్యార్థులకు అవగాహన పెరగాలని, చిన్నతనం నుండే ఆపదలో ఉన్నవారిని ఆదుకునే మనోభావం పెంపొందించుకోవాలని శ్రీ వి. భాస్కరాచారి అన్నారు. వట్టెం నవోదయ విద్యాలయం ఆధ్వర్యంలో నగర్ కర్నూల్‌లోని జ్ఞానేశ్వర వాత్సల్య మందిర అనాథ బాలికల ఆశ్రమం మరియు జ్ఞాన సరస్వతి ఆలయ ఆవరణలోని అనాథ బాలుర ఆశ్రమంలో ఉన్న బాలబాలికలకు దుప్పట్లు, స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు.నవోదయ విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెంపొందించి వారిని సమాజ సేవలో బాధ్యతాయుతులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవోదయ విద్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లాలో గురువారం తెల్లవారుజామున భూకంపం...




అమరావతి//ఫిబ్రవరి 19 ఆకాంక్ష : ఏపీలో భూప్రకంపనలు భయాందోళనలు సృష్టించాయి. పల్నాడు జిల్లాలో గురువారం తెల్లవారుజామున భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 3.5 తీవ్రత నమోదైంది. ఈ విషయాన్ని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ నిర్ధారించింది. వినుకొండకు 20 కిలోమీటర్ల దూరంలో భూఉపరితలానికి 10 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించింది. తెల్లవారుజామున 2:33 గంటలకు భూ ప్రకంపనలు వచ్చాయని తెలిపింది.ఈ భూకంప ప్రభావంతో పల్నాడు జిల్లాలోని వినుకొండతో పాటు దర్శి, చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ భూమి కంపించింది. అకస్మాత్తుగా భూమి కంపించడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. అయితే స్వల్ప ప్రకంపనల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని తెలుస్తోంది. అయితే, రానున్న రోజుల్లో మరిన్ని ప్రకంపనలు వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## నల్గొండ జిల్లాలో యూరియా యాప్‌కు
# వ్యతిరేకంగా రైతుల నిరసన...




నల్గొండ//ఫిబ్రవరి 19(ఆకాంక్ష) : యూరియా పంపిణీకి ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ విధానాన్ని వ్యతిరేకిస్తూ నల్గొండ జిల్లాలో రైతులు రోడ్డెక్కారు. పీఏపల్లి మండలం అంగడిపేట గ్రామం వద్ద నాగార్జునసాగర్ హైదరాబాద్ జాతీయ రహదారిపై అన్నదాతలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పాత పద్ధతిలోనే యూరియా పంపిణీ కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గంటల తరబడి రహదారిని దిగ్బంధించారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ యాప్ విధానం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్‌లో బుక్ చేసుకునేందుకు ప్రయత్నిస్తే ఓటీపీలు సకాలంలో రావడం లేదని, ఓటీపీ వచ్చేసరికి స్టాక్ పూర్తవుతోందని పేర్కొన్నారు. దీంతో తమ పంటల సాగుకు అవసరమైన ఎరువు సమయానికి అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గతంలో పాత విధానంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా లభించేదని, ప్రస్తుతం కొత్త విధానం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు.ఈ నిరసనకు బీఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ ఆధ్వర్యం వహించారు. బీఆర్ఎస్ నాయకులు, రైతులు కలిసి యాప్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత విధానంలోనే యూరియా పంపిణీ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు ఇబ్బందులు కలిగించే విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. రైతుల రహదారి నిరసనతో నాగార్జునసాగర్‌హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రైతులతో చర్చలు జరిపి ఆందోళన విరమింపజేసేందుకు ప్రయత్నించారు.ప్రభుత్వం తక్షణం స్పందించి యాప్ విధానంలో ఉన్న లోపాలను సరిదిద్దాలని, లేకపోతే పాత విధానంలోనే యూరియా పంపిణీ కొనసాగించాలని రైతులు స్పష్టంగా పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైతే ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు.

## హైదరాబాద్‌లో దారుణం నార్సింగి పరిధిలో బాలికపై అత్యాచారం...



హైదరాబాద్//ఫిబ్రవరి 19(ఆకాంక్ష) : హైదరాబాద్ జిల్లాలోని నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ఓ బాలికకు గంజాయి తాగించి మత్తులో ఉండగా ముగ్గురు రౌడీషీటర్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది.వివరాల్లోకి వెళితే, నార్సింగి పరిధిలో నివసిస్తున్న ఓ బాలికను నిందితులు మోసం చేసి తమతో పాటు తీసుకెళ్లినట్లు సమాచారం. అనంతరం ఆమెకు గంజాయి తాగించి స్పృహ తప్పే స్థితిలోకి వెళ్లగొట్టి, ఆ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ముగ్గురు కలిసి అత్యాచారానికి పాల్పడ్డారు. ఘటన తర్వాత బాలికను అక్కడే వదిలేసి నిందితులు పరారయ్యారు.తీవ్ర స్థితిలో ఉన్న బాలికను స్థానికులు గుర్తించి వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితురాలికి ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది. ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల వివరాలు సేకరించి, పరారీలో ఉన్న ముగ్గురు రౌడీషీటర్ల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.ఈ దారుణ ఘటనపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళల భద్రతపై మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు నిందితులను త్వరితగతిన పట్టుకుని కఠిన శిక్షలు విధిస్తామని హామీ ఇచ్చారు.

## తాండూరులో బీఆర్ఎస్ బంద్‌కు సంపూర్ణ మద్దతు...



మంచిర్యాల//ఫిబ్రవరి 19(ఆకాంక్ష) : మంచిర్యాల జిల్లాలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని తాండూర్ మండల బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అరెస్టుకు నిరసనగా గురువారం పిలుపునిచ్చిన జిల్లా బంద్ తాండూర్ మున్సిపాలిటీ పరిధిలో సంపూర్ణంగా అమలైంది.పలు వ్యాపార సంస్థలు, ప్రైవేటు విద్యాసంస్థలు బంద్‌కు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతూ మూతపడ్డాయి. బంద్ సందర్భంగా ఉదయం బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ క్యాతనపల్లిలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు సంపూర్ణ మెజారిటీ ఇచ్చినప్పటికీ, కేవలం ఏడు స్థానాలకు పరిమితమైన కాంగ్రెస్ పార్టీ అధికార బలాన్ని ఉపయోగించి మున్సిపల్ పీఠాన్ని దక్కించుకునేందుకు అడ్డదారులు అనుసరిస్తోందని ఆరోపించారు. దీన్ని అడ్డుకున్న బాల్క సుమన్‌పై తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు.కాంగ్రెస్ నాయకుల అరాచకాలు, కుయుక్తులను ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్తులో వారికి తగిన గుణపాఠం చెబుతారని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. పార్టీ పిలుపునకు స్వచ్ఛందంగా సహకరించిన వ్యాపారులు, విద్యాసంస్థల ప్రతినిధులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దత్తుమూర్తి, మాజీ ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్ సహా పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ం

## నాగుల గుట్టపై చరిత్ర చెబుతున్న
# అపురూప నాగ శిల్పాలు ధ్వంసం...





కరీంనగర్//ఫిబ్రవరి 19(ఆకాంక్ష) : కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం అన్నారం గ్రామంలోని నాగులమ్మ గుట్టపై చెక్కబడి ఉన్న ప్రాచీన నాగదేవత శిల్పాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఒకప్పుడు నిత్య పూజలు అందుకున్న ఈ అపురూప శిల్పాలు నేడు చెల్లాచెదురుగా పడిపోయి నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. వర్షాలు సమృద్ధిగా కురవాలని, సంతానం కలగాలని, గ్రామాన్ని పరిరక్షించాలని భక్తులు మొక్కులు చెల్లించుకునే నాగ దేవత శిల్పాలకు ప్రత్యేకమైన చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది.అన్నారం గ్రామానికి సమీపంలోని ఈ గుట్టను అనాదిగా నాగులమ్మ గుట్టగా పిలుస్తున్నారు. గుట్టపై ఏడు పడగలతో నాగదేవత శిల్పం ఒక పక్కకు పడేసి ఉండగా, ఆ శిల్పం ద్విభుజిగా కనిపిస్తోంది. కుడిచేతిలో కత్తి, ఎడమ చేతిలో డాలు ధరించిన అర్ధనారీ నాగశిల్పం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పక్కనే మరొక నాగ శిల్పం కూడా ఇదే రూపంలో ఉండగా, మరో రెండు నాగ శిలలు గుట్టపై ఉన్న పెద్ద బండరాయికి ఆనించి ఉన్నాయి.గుట్టపై చిన్నపాటి కోనేరు ఉండటం కూడా ఈ ప్రాంతానికి ప్రత్యేకతను చేకూర్చుతోంది. భక్తులు తమ కోర్కెలు నెరవేరాలని కోరుకుంటూ ఈ శిలలకు మొక్కులు ముట్టజెప్పేవారని స్థానికులు చెబుతున్నారు. చరిత్రకారుల ప్రకారం 16వ శతాబ్దంలో ఇటువంటి నాగ శిలలు విస్తృతంగా ఏర్పడ్డాయి. సమీపంలోని జగిత్యాల జిల్లా నాగులపేటలో గతంలో జరిగిన తవ్వకాల్లో సుమారు 285 వరకు నాగశిలలు వెలికితీయబడ్డాయి.ఇంతటి ఘన చరిత్ర కలిగిన నాగుల గుట్ట ప్రస్తుతం క్వారీ కార్యకలాపాల బారిన పడింది. ప్రస్తుతం పనులు నిలిచిపోయినా, క్వారీ ఆనవాళ్లు, చెదిరిపోయిన బండరాళ్లు, ధ్వంసమవుతున్న నాగశిల్పాలు అక్కడి దుస్థితిని తెలియజేస్తున్నాయి. చారిత్రక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింబించే ఈ గుట్టను పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని చరిత్రకారులు, స్థానికులు ప్రభుత్వాన్ని మరియు పురావస్తు శాఖ అధికారులను ముక్తకంఠంతో కోరుతున్నారు.


## అన్నా, వదినలను హతమార్చిన వ్యక్తి...

ఉత్తర ప్రదేశ్/ఫిబ్రవరి 19(ఆకాంక్ష) : అదో అందమైన ఉమ్మడి కుటుంబం. రోజూలాగే అందరూ కలిసి రాత్రి భోజనానికి కూర్చున్నారు. అంతా హాయిగా మాట్లాడుకుంటూ తింటున్నారు. కానీ అంతలోనే వారి మధ్య ఓ చిన్న వాగ్వాదం తలెత్తింది. ఏముందిలే మాట్లాడుకుని సర్దిపుచ్చుకుంటారని కుటుంబ సభ్యులంతా భావించారు. కానీ అదే ఆ కుటుంబంలోని ఇద్దరి ప్రాణాలను తీస్తుందని ఎంతమాత్రమూ ఊహించ లేక పోయారు. ముఖ్యంగా అన్నా, వదినలతో తలెత్తిన గొడవతో.. ఆ తమ్ముడు తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. ఉక్రోశంతో ఊగిపోతూ.. వెంటనే ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకువచ్చి మరీ దాడికి పాల్పడ్డాడు. అన్నావదినలను ఇద్దరినీ నరికి చంపేశాడు. వీరిని ఆపేందుకు వెళ్లగా.. మధ్యలో మరో వ్యక్తికి కూడా తీవ్ర గాయాలు కాగా.. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. భోజనం చేస్తుండగా తలెత్తిన ఓ చిన్న గొడవ ఆ ఇంటినే నాశనం చేసింది. ముఖ్యంగా ఓ యువకుడికి తన అన్న, తమ్ముడితో గొడవ మొదలు కాగా.. తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయాడు. చేతిలో ఉన్న పళ్లాన్ని పక్కన పడేసి.. ఇంట్లోకి పరిగెత్తి మరీ కత్తి తీసుకు వచ్చాడు. తనను తిట్టిన అన్నా, తమ్ముడిపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఆపేందుకు వెళ్లిన వదినపై కూడా దాడికి పాల్పడగా..ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మరోవైపు ఆమె భర్త కూడా చనిపోగా.. మరో వ్యక్తి ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు.

అసలేం జరిగిందంటే..

ఉత్తర ప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లా నైమిశారణ్య పోలీస్ స్టేషన్ పరిధిలోని ఠాకూర్‌పూర్వ గ్రామంలో బుధవారం రాత్రి ఈ ఘోరం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఠాకూర్‌పూర్వ గ్రామానికి చెందిన 37 ఏళ్ల శ్యాము, 40 ఏళ్ల హరీష్, రాము అన్నదమ్ములు. అయితే ముగ్గురు కొడుకులు, కోడళ్లు వారి పిల్లలతో పాటే తల్లిదండ్రులు కూడా కలిసుంటూ హాయిగా జీవిస్తున్నారు. అయితే ఎప్పటిలాగే బుధవారం రాత్రి కుటుంబ సభ్యులంతా కలిసి

# భోజన సమయంలో గొడవ..



భోజనం చేస్తున్నారు. ఈక్రమంలోనే శ్యాముకు, తన అన్నదమ్ములకు మధ్య ఏదో విషయంలో వాగ్వాదం మొదలైంది. ఉమ్మడి కుటుంబంలో వచ్చే చిన్నపాటి గొడవలే కదా అని అందరూ భావించారు. మాట్లాడుకుంటూ సమస్య సమిసిపోతుందని భావించారు. కానీ అదే గొడవ ఆ ఇంటిని కకావికలం చేస్తుందిన ఎంతమాత్రమూ గ్రహించలేక పోయారు.ముఖ్యంగా అన్నదమ్ములిద్దరూ తనతో గొడవ పడడాన్ని ఏమాత్రం జీర్ణించుకోలేక పోయిన శ్యాము ఒక్కసారిగా ఆగ్రహంతో ఊగిపోయాడు. క్షణికావేశంలో ఇంట్లోని పదునైన కత్తిని తీసుకుని తన అన్న హరీష్, తమ్ముడు రాములపై విచక్షణారహితంగా దాడికి తెగబడ్డాడు. అన్నదమ్ముల మధ్య జరుగుతున్న గొడవను చూసి హరీష్ భార్య 35 ఏళ్ల పూనమ్ వారిని వారించే ప్రయత్నం చేసింది. గొడవ ఆపమని వేడుకుంటూ శ్యాముకు అడ్డుగా వెళ్లింది. అయితే అప్పటికే తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్న శ్యాము.. వదనపై కూడా దాడికి పాల్పడ్డాడు. కత్తితో విచక్షణాహారితంగా దాడి చేశాడు. ముగ్గురినీ తీవ్రంగా గాయపరిచిన అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు.అయితో రక్తపు మడుగులో పడి ఉన్న ముగ్గురినీ.. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు వెంటనే నైమిశారణ్యలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అయితే పూనమ్ అప్పటికే మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. చికిత్స పొందుతూ హరీష్ కూడా ప్రాణాలు కోల్పోయాడు. చిన్న తమ్ముడు రాము పరిస్థితి విషమంగా ఉండటంతో అతడిని మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. అదనపు ఎస్పీ దుర్గేష్ సింగ్ ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. నిందితుడు శ్యాముపై కేసు నమోదు చేసి, అతడిని పట్టుకోవడానికి ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి పంపించారు. చిన్నపాటి గొడవే ఇంతటి దారుణానికి దారితీయడం అత్యంత దురదృష్టకరం అని పోలీసులు పేర్కొన్నారు.

# ఉండవెల్లి మండలంలో ఆర్టీసీ బస్సు బీభత్సం...

### 20 మందికి పైగా ప్రయాణికులకు తీవ్ర గాయాలు...

గద్వాల// ఫిబ్రవరి 19(ఆకాంక్ష) : గద్వాల జిల్లాలో గురువారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఉండవెల్లి మండలం ఇటిక్యాలపాడు గ్రామం సమీపంలో అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు గుంతలో పడిపోవడంతో 20 మందికిపైగా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ నుండి అనంతపురం వైపు వెళు_న్న ఈ బస్సు ప్రమాదానికి గురైంది. తెల్లవారుజామున ప్రయాణిస్తున్న సమయంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు రోడ్డుపక్కనున్న లోతైన గుంతలోకి దూసుకెళ్లినట్లు సమాచారం. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండడంతో బస్సులో ఉన్న పలువురికి కాళ్లు, చేతులు విరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదం సంభవించిన వెంటనే స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని రక్షణ చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్ వాహనాల ద్వారా కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి



తరలించారు. వైద్యులు బాధితులకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.ఈ ప్రమాదంలో గాయపడిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. సుబ్బారాయుడు (45) రెండు భుజాలలో తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నారు. అరుణ (45) పెల్విక్ ఎముకల ప్రాంతంలో తీవ్రమైన నొప్పితో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మోహన్ రెడ్డి (63) తల టెంపరల్ ప్రాంతంలో వాపు, ఎడమ చేయిలో వాపుతో బాధపడుతున్నారు. రామేశ్వరమ్మ (45) ఎడమ చేతి వేళ్లలో కోత గాయంతో చికిత్స పొందుతున్నారు. రంన్న (28), శివ (24), వీరేశ్ (55) ముగ్గురికి చేతి మణికట్టు విరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. గౌస్ (30)కు శరీరమంతా గీతలు గాయాలు కాగా, సేనాత లత (23)కు కుడి చెవి నుండి రక్తస్రావం, ఎడమ చేతి మణికట్టు విరిగినట్లు సమాచారం.ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణమా, లేక వాహన సాంకేతిక లోపమా అన్న కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు. జిల్లా అధికారులు సంఘటనపై విచారం వ్యక్తం చేస్తూ గాయపడిన వారికి తక్షణ వైద్యం అందించాలని ఆదేశించారు.ఈ ఘటనతో గద్వాల జిల్లా ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రోడ్డు భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

## నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన సామాజిక సేవా కార్యకర్త పోతుల రాములు యాదవ్...

జనగామ//ఫిబ్రవరి 19(ఆకాంక్ష) : జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలో నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే వ్యక్తిగా పేరు తెచ్చుకున్న పోతుల రాములు యాదవ్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని పొచ్చన్నపేట గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన రేణిగుంట బాలయ్య కుటుంబాన్ని గురువారం స్వయంగా కలిసి పరామర్శించి వారికి ధైర్యం చెప్పడమే కాకుండా ఆర్థిక సహాయంగా రూ.5,000 అందించారు.గ్రామానికి చేరుకున్న వెంటనే బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన పోతుల రాములు యాదవ్, బాలయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల బాధను దగ్గరగా చూసి వారిని ఓదార్చి "మీకు నేనున్నాను" అంటూ మనోధైర్యం నింపారు. అకాలంలో కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకొని, తక్షణ అవసరాల కోసం తన వంతుగా ఆర్థిక సాయం అందించారు. ఆర్థిక సహాయం అందించిన పోతుల రాములు యాదవ్ పట్ల కృతజ్ఞతాభావం వ్యక్తం చేశారు. తమలాంటి నిరుపేద కుటుంబాల



పట్ల చూపుతున్న ప్రేమాభిమానాలకు ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా పోతుల రాములు యాదవ్ మాట్లాడుతూ, సమాజంలో ఉన్న పేదలను ఆదుకోవడం, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం తన జీవితం యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. మనిషిగా పుట్టిన మనం ఇతరులకు ఉపయోగపడినప్పుడే జీవితానికి నిజమైన సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరింతగా సేవా కార్యక్రమాలు చేపట్టి మరిన్ని కుటుంబాలకు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. వారిలో రేణుకుంట సత్తయ్య, బాలరాజు, దిలీప్, తరిగొప్పు శ్రీశైలం, రేణుకుంట యాదయ్య, భాను, తీగల చంద్రమౌళి, మంత్రి సిద్ధులు, రేణుకుంట జయమ్మ తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు తమ సానుభూతి తెలియజేశారు.

## సిపిఐ(యం-ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ నుండి షేక్ షావలిని బహిష్కరణ...

### సిపిఐ (ఎం-ఎల్) సిపి రెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి,మల్లేపల్లి ప్రభాకర్...

హైదరాబాద్//ఫిబ్రవరి 19(ఆకాంక్ష) : సిపిఐ(యం-ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ నుండి షేక్ షావలిని నెల రోజుల ముందే బహిష్కరించినట్లు సిపిఐ (ఎం-ఎల్) సిపి రెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి,మల్లేపల్లి ప్రభాకర్ తెలిపారు.గురువారం హైదరాగుడలో మీడియా సమావేశం లో పోలిట్ బ్యూరో మెంబర్ చిట్టి బాబు, సిపిఐ (ఎం-ఎల్) సిపి రెడ్డి పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, పోలిట్ బ్యూరో మెంబర్ సంపంగి పద్మక్క,ూెూ జాతీయ అధ్యక్షురాలు, పోలిట్ బ్యూరో మెంబర్, దిగంబర్, మహారాష్ట్ర పార్టీ కార్యదర్శి, పోలిట్ బ్యూరో మెంబర్ తో కలిసి మాట్లాదారు. కమ్యూనిస్టు నైతిక విలువలు, మానసిక స్థైర్యం కోల్పోయి అరాచక గ్రూపులలో కలిసి పార్టీ నాయకత్వంపై పోస్టర్లు వేయడం షేక్ షావలి కమ్యూనిస్టు విలువలకు నిదర్శనమన్నారు. మెజార్టీ పోలిట్ బ్యూరో, జాతీయ కమిటీ సభ్యులకు తెలియకుండా, పార్టీ అంటే నేను నేను అంటే పార్టీ అంటూ షేక్ షావలి జాతీయ కార్యదర్శిగా ప్రకటించుకోవడమంటే ఆయన దివాలాకోరు తనానికి నిదర్శనం. గత 3 సంవత్సరాల క్రితం సిపిఐ (యం-ఎల్) రాంచంద్రన్, సి పి ఐ (యం- ఎల్) ప్రతిఘటన, సిపిఐ (యం-ఎల్) క్రాంతి సంస్థలు ఐక్యం కావడం జరిగింది. 3 పార్టీల ఐక్యతలో ప్రతిఘటన పార్టీ మొత్తం బయటకు వెళ్ళిపోయింది, దీనికి కారణం షేక్ పావలి మొనార్కిజం వల్లే జరిగింది. ప్రస్తుతం షేక్ పావలి మిగిలి ఉండి, ఈయన చేస్తున్న పార్టీ వ్యతిరేక పనులు, విలేకరిగా ఉండటం, చీ+ూ, ుఖజీూజ, ఇతర సంస్థలతో




పనిచేయడం, హైదరాబాద్ లో ఏ మీటింగ్ ఉన్నా పార్టీకి తెలియకుండా జవహర్ నగర్ నుండి పార్టీ పేరుతో ప్రజలను తీసుకెళ్ళడం, ప్రజల ఖర్చులు అంటూ మీటింగ్ నిర్వాహకుల దగ్గర డబ్బులు వసూలు చేసుకోవడం దినచర్యగా మారిందని ఆరోపించారు.జనవరి 21, 22, 2026 న సంగారెడ్డిలో పోలిట్ బ్యూరో అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రజా సంఘాల రద్దు విషయం చేసింది షేక్ షావలి. దీన్ని కమిటీ ఆమోదించడం జరిగింది. ఈ సందర్భంలోనే షేక్ షావలి పని విధానంపై చర్చ జరిగింది. విలేకరి, చీ+ూ, ుఖజీూజ, ఇతర ప్రజా సంఘాలతో, శాస్త్రీయ దృక్పథం లేని సంస్థలు, జెండా, ఎజెండా లేని సంస్థలను పార్టీ గుర్తించినప్పుడు వాటికి షేక్ షావలి వెళ్ళొద్దు అని పార్టీ సిరియస్ గా హెచ్చరించింది. దీనిపై పార్టీ షేక్ పావలి వివరణ కోరగా నేను పార్టీ పరంగా ఉండలేను మడికట్టు రాజకీయాలు నేను చేయను నేను వీటితోనే ఉంటాను అని వివరణ ఇవ్వడంతో పార్టీ సిరియస్ గా అలా ఉంటే పార్టీ నుండి సస్పెండ్ (బహిష్కరణ) చేయడం జరుగుతుందని అనడంతో షేక్ షావలికి తెలియజేయడం జరిగిందని వివరించారు. సమావేశం మధ్యలోనే వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయిన వ్యక్తి మానసిక స్థైర్యం, విచక్షణ, నైతిక విలువలు, కమ్యూనిస్టు భావాలు మర్చిపోయి పార్టీ నాయకత్వంపై, బూర్జువా పార్టీలు సైతం తలదించుకునేలా పార్టీపై, నాయకత్వంపై పోస్టర్స్, కరపత్రాలు, సోషల్ మీడియాలో లేనిపోని ఆరోపణలతో విరుచుకుపడుతున్న షేక్ షావలి పార్టీ ప్రజా కోర్టులో నిలబెడుతుందని పార్టీ హెచ్చరించడమైనది. పార్టీ నుండి ముందుగానే బహిష్కరణకు గురైన షేక్ షావలి, జాతీయ కమిటీ సభ్యులకు, రాష్ట్ర కార్యదర్శులకు, పోలిట్ బ్యూరోకు తెలియకుండానే తనకు తాను పార్టీ జాతీయ కార్యదర్శిగా పేపర్లకు ప్రకటన ఇవ్వడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం. కమ్యూనిస్టు పార్టీ నైతిక విలువలు దెబ్బ తీసేలా తన చర్యలని మేధావులు, అభ్యుదయవాదులు, ప్రజలు నమ్మవద్దని, దివాళా కోరుతనానికి పాల్పడుతున్న షేక్ షావలిని, ప్రజా సమూహం నుండి బహిష్కరించాలని మల్లేపల్లి ప్రభాకర్ విజ్ఞప్తి చేసారు.

### గత ప్రభుత్వం అప్పుల భారం
## నుంచి కోలుకుంటున్నాం మంత్రి పయ్యావుల

అమరావతి/ఫిబ్రవరి 19(ఆకాంక్ష) : గత ప్రభుత్వం అప్పుల భారం నుంచి కోలుకుంటున్నామని ఏపి మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఏపిని గాడిలో పెట్టేలా ఈ బడ్జెట్ ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన శాసనమండలిలో ప్రసంగించారు. మూడో



బడ్జెట్ తో అభివృద్ధి- సంక్షేమం పరుగులు పెట్టిస్తున్నామని, గత ప్రభుత్వం విధ్వంసం ప్రక్షాళన కోసం మొదటి బడ్జెట్ పెట్టామని పయ్యావుల తెలియజేశారు. రాష్ట్ర భవిష్యత్ కు కూటమి ప్రభుత్వం మళ్లీ మళ్లీ రావాల్సిన అవసరం ఉందని, సకాలంలో పెన్షన్లు అందించాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు

## కర్రెగుట్టలో మరోసారి భారీ ఎన్‌కౌంటర్...

### ఐదుగురు మావోయిస్టులు మృతి...

హైదరాబాద్//ఫిబ్రవరి 19(ఆకాంక్ష) : కర్రెగుట్టలో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఆపరేషన్-2 కగార్ పేరుతో కర్రెగుట్టలో భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో బలగాలు, మావోయిస్టుల మధ్య ఎన్ కౌంటర్ జరిగినట్లు తెలుస్తోంది. ఈ కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు



మృతి చెందినటట్లు సమాచారం. ప్రస్తుతం ఎన్ కౌంటర్ కొనసాగుతోంది. బుధవారం మావోయిస్టు అగ్ర నేతలే టార్గెట్‌గా భద్రతా బలగాలు ఆపరేషన్-2 కగార్ ప్రారంభించాయి. దాదాపు ఐదు వేల మంది సీఆర్పీఎఫ్ బలగాలతో కూంబింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. కాగా, గతంలో హోంమంత్రి అమిత్ షా, 2026 మార్చి చివరికల్లా మావోయిస్టులను అంతమొందిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. అమిత్ షా డెడ్ లైన్ దగ్గరపడుతుండటం నేపథ్యంలో భద్రతా బలగాలు భారీ ఆపరేషన్ కు సిద్ధమయ్యారు.

## జన్ సేవా సంఘ్ సభ్యుడు విశ్రామ్ సరోజ్ ఇంటి పై దాడి చెసిన వారిపై చర్యలు తీసుకోండి...

మాధాపూర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌ను కలిసి జన్ సేవా సంఘ్ సమస్య పరిష్కార కమిటీ...



హైదరాబాద్//ఫిబ్రవరి 19 **ఆకాంక్ష** : ఇష్నాపూర్ నివాసి మరియూ జన్ సేవా సంఘ్ సభ్యుడు విశ్రామ్ సరోజ్ ఇంట్లోకి ప్రవేశించి, మహిళలు మరియు పిల్లలపై దారుణంగా దాడి చేసిన సంఘటనలో పోలీసులు ఇంకా ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయక పోవటం ఎటువంటి చర్య తీసుకోక పోవడం పై జన సేవా సంఘ్ సమస్య పరిష్కార కమిటీ కన్వీనర్ పరమానంద్ శర్మ ఆద్వర్యం లో మాధాపూర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌ను కలిసి చర్య తీసుకోవాలని కోరారు. జనవరి 28న, సుమారు 8 నుండి 10 మంది స్థానికులు ఇష్నాపూర్ నివాసి మరియూ జన్ సేవా సంఘ్ సభ్యుడు విశ్రామ్ సరోజ్ ఇంట్లోకి ప్రవేశించి, మహిళలు మరియు పిల్లలపై దారుణంగా దాడి చేసినట్లు వారు పిర్యాదు చేసారు. అధికారుల నుండి సమాచారం అందుకున్న సంబంధిత అధికారి వెంటనే డిప్యూటీ కమిషనర్ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి, త్వరలో చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. డిప్యూటీ కమిషనర్ ను సమస్య పరిష్కార కమిటీ కన్వీనర్ పరమానంద్ శర్మ, కె.డి. చౌబే, సురేష్ పండిట్, ఎల్.ఎమ్. చౌదరి వినీత్ సింగ్, జి.డి. పాఠక్, మరియు జితేందర్ సింగ్ హాజరయ్యారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు...



భద్రాచలం/ఫిబ్రవరి 19 **ఆకాంక్ష** : భద్రాచలం పట్టణంలో పలు కాలనీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. పట్టణంలోని అశోక్ నగర్ కొత్త కాలనీ, ఆదర్శ నగర్ కాలనీ, జి సి సి ఆఫీస్ పరిసర ప్రాంతాల్లో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీ పనులకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆధ్వర్యంలో శంకుస్థాపనలు నిర్వహించారు. కార్యక్రమానికి ఐటిడిఏ పిఓ రాహుల్, భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 8వ వార్డు సభ్యురాలు పెద్దినేని లక్ష్మీ, 14వ వార్డు సభ్యుడు అనుముల అశోక్ సమక్షంలో జి సి సి ఆధ్వర్యంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. కాలనీలలో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం చేపడుతున్న ఈ పనులు



పూర్తయితే ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దశలవారీగా మరిన్ని పనులు చేపడతామని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, సర్పంచ్ పూనెం కృష్ణలను 14వ వార్డు సభ్యుడు అనుముల అశోక్ శాలువాలతో సత్కరించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు అభివృద్ధి పనులను సమయానికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కారం దుర్గారావు, నిట్టా రాజు, చెంచు సుబ్బారావు, సున్నం భూలక్ష్మి, సున్నం ఈశ్వరి, జగ్గా కుమారి, మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గోదావరిఖనిలో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు...



గోదావరిఖని//ఫిబ్రవరి 19 **ఆకాంక్ష** : సాహసానికి మారుపేరు ఛత్రపతి శివాజీ అని మహంకాళి స్వామి కొనియాడారు. ఛత్రపతి శివాజీ జయంతి పురస్కరించుకొని గురువారం రామగుండం నగర పరిధిలోని జి.ఎం కార్యాలయం వద్ద ఉన్న శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ మొఘల్ సామ్రాజ్యానికి ఎదురు నిలిచి దేశంలో మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించిన గొప్ప యోధుడు ఛత్రపతి శివాజీ అని తెలిపారు. ఆయన దేశభక్తి, ధర్మనిరతి, పరిపాలనలో న్యాయం, సర్వమత సమభావం వంటి విలువలు నేటి తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. సమాజానికి ధైర్యం, న్యాయం, సమానత్వం అనే విలువలను అందించిన మహానుభావుడిగా ఆయనను స్మరించుకోవడం గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ముస్తఫా, గట్ల రమేష్, దాసరి సాంబమూర్తి, కొలని కవిత, చిదురాల నాగరాజు, కౌటం సతీష్ పాల్గొన్నారు. అదేవిధంగా నాయకులు వేగోళపు శ్రీనివాస్, ఆరే కుల సంఘం నాయకులు సమ్మారావు, మీనేష్ తదితరులు పాల్గొని శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జన సమూహం పెద్ద ఎత్తున పాల్గొని శివాజీ మహారాజ్ సేవలను కొనియాడుతూ జై శివాజీ నినాదాలతో ప్రాంతం మార్మోగింది. ఈ సందర్భంగా యువతలో దేశభక్తి, ధైర్యం, నైతిక విలువలు పెంపొందించాలని నాయకులు పిలుపునిచ్చారు.

## రామగుండం పోలీస్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మేయర్...



గోదావరిఖని//ఫిబ్రవరి 19 **ఆకాంక్ష** : రామగుండం నగర నూతన మేయర్‌గా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన మహంకాళి స్వామి గురువారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ను కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ స్వామి పోలీస్ కమిషనర్‌కు శాలువా కప్పి పూల మొక్కను బహుకరించి సన్మానించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నూతన మేయర్ మహంకాళి స్వామికి శుభాకాంక్షలు తెలుపుతూ నగరాభివృద్ధికి పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. నగరంలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల సమస్యల పరిష్కారంలో పరస్పర సమన్వయం అవసరమని పేర్కొన్నారు. మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ రామగుండం నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు అన్ని శాఖల సహకారం అవసరమని, ముఖ్యంగా పోలీసు శాఖతో సమన్వయం కొనసాగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది.

## మేయర్, డిప్యూటీ మేయర్‌లను ఘనంగా సన్మానించిన గీతా సహకార సంఘం...



గోదావరిఖని//ఫిబ్రవరి 19 **ఆకాంక్ష** : పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో గీతా సహకార సంఘం నెంబర్-2 ఆధ్వర్యంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మరియు డిప్యూటీ మేయర్‌లను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమం స్థానికంగా విశేషంగా ఆకట్టుకుంది. గీతా సహకార సంఘం ప్రతినిధులు మేయర్, డిప్యూటీ మేయర్‌లను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించి తమ గౌరవాన్ని తెలియజేశారు. మున్సిపల్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తూ ప్రజలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ సన్మానం నిర్వహించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలు, రోడ్ల విస్తరణ వంటి పలు అంశాలలో మేయర్, డిప్యూటీ మేయర్ కృషి ప్రశంసనీయం అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడగొని లక్ష్మీనారాయణ గౌడ్, గోపగోని సతీష్ గౌడ్, మేడోగోని శశిరేఖ, రంగు రాజయ్య గౌడ్, గంగాధర కృష్ణగౌడ్, బొంగుని శ్రీనివాస్ గౌడ్, పబ్బ శ్రీనివాస్ గౌడ్, కట్టగోని రాజు గౌడ్, ఎర్రోళ్ల శ్రీనివాస్ గౌడ్, ఆరెళ్ల వేణుగోపాల్ గౌడ్, పబ్బ భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన పేరుతో వచ్చిన ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం లేకుండా పోయింది....

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏమి జరిగిందో సీసీటీవీ దృశ్యాలను బయటపెట్టాలి...

బీఆర్ఎస్ నేత కౌశిక హరి



గోదావరిఖని//ఫిబ్రవరి 19 **ఆకాంక్ష** : ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం పూర్తిగా కనుమరుగైందని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కౌశిక హరి తీవ్రంగా ఆరోపించారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా పోలీస్ యంత్రాంగం, పాలనా యంత్రాంగం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లా వ్యవహరించిందని ఆయన విమర్శించారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మురళీధర్ రావుతో కలిసి మాట్లాడిన కౌశిక హరి, రాష్ట్రంలో కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుండి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను బెదిరింపులకు గురిచేసిందని ఆరోపించారు. ప్రతిపక్షాల అభ్యర్థులను నామినేషన్ ఉపసంహరించుకునేలా ఒత్తిడి చేయడం, వారితో ఎవరూ తిరగకుండా అడ్డుకోవడం వంటి చర్యలు తీసుకున్నారని అన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత కూడా అదే తీరును కొనసాగిస్తూ, కాంగ్రెస్ పార్టీకి బలం లేని క్యాతనపల్లి వంటి మున్సిపాలిటీలను అధికార బలంతో స్వాధీనం చేసుకునేందుకు పోలీస్ యంత్రాంగం, ప్రభుత్వ అధికారులను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో మొత్తం 22 వార్డులకు గాను కేవలం 7 సీట్లను మాత్రమే గెలిచిన కాంగ్రెస్ పార్టీ, చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ ప్రయత్నాలను అడ్డుకున్న బాల్క సుమన్‌పై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే ఆయనపై నమోదైన కేసులను ఉపసంహరించుకుని క్యాతనపల్లిలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామగుండం కార్పొరేషన్‌లో కూడా బెదిరింపుల నడుమ ఎన్నికలు జరిగాయని, పోలింగ్‌కు ముందు రోజు అర్ధరాత్రి కరెంట్ నిలిచిపోవడం అనుమానాస్పదమని పేర్కొన్నారు. ఆ సమయంలో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏమి జరిగిందో సీసీటీవీ దృశ్యాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. గెలవాల్సిన అభ్యర్థులు ఓడిపోవడం, ఓడిపోవాల్సిన అభ్యర్థులు గెలవడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని ఆవేదన వ్యక్తం చేసిన కౌశిక హరి, రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ మేకల సమ్మయ్యతో పాటు నాయకులు జె.వి.రాజు, పర్లపల్లి రవి, జక్కుల తిరుపతి, కిరణ్ జీ, చింటూ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు నాయుడు పాలనలో ప్రతీ అంశంలోనూ మోసమే కనిపిస్తోంది

మాజీ సిఎం వైసిపి జగన్ మోహన్ రెడ్డి...



అమరావతి//ఫిబ్రవరి 19 **ఆకాంక్ష** : ఏపి సిఎం చంద్రబాబు నాయుడు పాలనలో ప్రతీ అంశంలోనూ మోసమే కనిపిస్తోందని మాజీ సిఎం వైసిపి జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా అప్పులు చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అప్పుల్లో ఆల్ టైం రికార్డులు బద్దలు కొడుతున్నారని, ఉన్న స్కీములను తీసేసారు.. కొత్త స్కీములు లేవు అని విమర్శించారు. అప్పులతో తెచ్చిన డబ్బంతా దోచుకో.. తినుకో.. పంచుకో అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు ఇంటింటికీ వెళ్లి బాండ్లు పంచారని, ఇప్పుడు ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు మాటలు కోటలు దాటుతున్నాయి.. చేతలు గడప దాటవు అని తెలియజేశారు. తాము మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు నెరవేర్చామని చంద్రబాబుకు మాత్రం మేనిఫెస్టో అంటే చిత్తుకాగితం అని ధ్వజమెత్తారు. నిరుద్యోగ భృతి ఏమైంది? అని ప్రశ్నించారు. కోవిడ్ లాంటి సమయంలోనూ తాము మేనిఫెస్టో అమలు చేశామని, నిరుద్యోగ భృతి హామీ ఇవ్వడం చంద్రబాబుకు మొదటిసారి కాదు అని అన్నారు ప్రతి నెలా అబద్ధాలు చెబుతున్నారని.. ప్రతీ మీటింగ్ కు ఒక పెన్షన్ కట్ చేస్తున్నారని, నిరుద్యోగులకు రూ.21 వేల 600 కోట్లు, ఈ మూడేళ్లలో మహిళలకు రూ. 97 వేల 200 కోట్లు, ప్రతి మహిళకు రూ.54 వేలు చంద్రబాబు బకాయిపడ్డారని చెప్పారు. ప్రతి మహిళలకు నెలకు 1500 ఇస్తామన్నారు.. బడికి వెళ్లే ఒక్కో పిల్లాడికి ఏటా రూ.15 వేలు ఇస్తామన్నా.. ఏమైంది? అని ప్రశ్నించారు. తాము 66 లక్షల 34 వేల 372 మందికి పెన్షన్లు ఇచ్చామని, 18-60 ఏళ్ల లోపు మహిళలకు కోటీ 80 లక్షల మంది ఉన్నారని అన్నారు. తల్లికి వందనం పథకాన్ని నిర్వీర్యం చేశారని, 18 నెలల్లోనే బాబు 5 లక్షల 38 వేల 636 పెన్షన్లు కట్ చేశారని ధ్వజమెత్తారు. తమ హయాంలో ఆరు నెలలకోసారి కొత్త పెన్షన్లు అప్‌డేట్ అయ్యేవని, ఈ ఏడాది 7 లక్షల 45 వేల 993 పెన్షన్లు కట్ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని పేర్కొన్నారు. గ్యాస్ లో కూడా భారీగా కోత పెట్టారని, ఏటా 3 సిలిండర్లు ఇస్తామన్నారు.. ఇప్పటి వరకు ఎంతమందికి ఇచ్చారు? అని ప్రశ్నించారు.

# నాలుగు లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలి...

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కూరపాటి రమేష్...




నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 19 **ఆకాంక్ష** : దేశ కార్మిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసే నాలుగు లేబర్ కోడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కూరపాటి రమేష్ డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలు, ప్రతిపక్షాల అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ అమల్లోకి తీసుకువచ్చిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల పట్ల ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరంకుశ వైఖరి అవలంబిస్తోందని, కార్పొరేట్లకు ఊడిగం చేసేలా ఈ లేబర్ కోడ్స్ రూపొందించబడినట్లు ఆయన ఆరోపించారు. దేశ కార్మిక వర్గం సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కాలగర్భంలో కలిపే ప్రయత్నం జరుగుతోందని, ఐదేళ్లుగా కార్మికుల ఆగ్రహానికి భయపడి వెనకడుగు వేసిన కేంద్రం ఇప్పుడు కార్పొరేట్ అనుకూల విధానాలను వేగవంతం చేస్తోందని అన్నారు. వేతనాల కోడ్ (2019), పారిశ్రామిక సంబంధాల కోడ్ (2020), సామాజిక భద్రతా కోడ్ (2020), వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ (2020)ల అమలుతో కార్మికుల హక్కులు హరించబడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కోడ్స్ ద్వారా పని గంటలు పెరుగుతాయని, అసంఘటిత రంగ కార్మికులకు చట్టపరమైన రక్షణలు తగ్గిపోతాయని, వేతనాల నిర్వచనాన్ని మార్చి బోనస్, అలవెన్సులు వంటి ప్రయోజనాలను కుదించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. లేబర్ కోడ్స్ అమలుతో ఉద్యోగ భద్రత తగ్గిపోతుందని, కార్మికులు సమ్మె చేయాలంటే 60 రోజుల ముందే నోటీసు ఇవ్వాల్సిన పరిస్థితి తీసుకువచ్చారని ఆయన విమర్శించారు. 1885 చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తితో సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచేలా చట్టాలు రూపొందించడం కార్మికులపై దాడేనని అన్నారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మికులకు సరైన వేతనాలు చెల్లించకుండా మూడు నుంచి నాలుగు నెలల వరకు పెండింగ్‌లో ఉంచుతోందని, స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు పిఆర్సి ప్రయోజనాలు ఇవ్వకుండా పని చేయించుకుంటోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి కార్మిక హక్కులను రక్షించాలని, లేదంటే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర అధ్యక్షులు పసియుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు వర్ధన్ పర్వతాలు, జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య, ఉపాధ్యక్షులు శివ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం...

శ్రీపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం...



నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 19 **ఆకాంక్ష** : నాగర్ కర్నూల్ మండలంలోని శ్రీపురం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను గురువారం ఘనంగా ప్రారంభించారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కుచుకుళ్ల రాజేష్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ కార్యక్రమం గ్రామ ప్రజల్లో ఆనందోత్సాహాలను నింపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి లబ్ధిదారులతో మాట్లాడుతూ పేదల గృహావసరాలను తీర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి గృహ సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అనేక కుటుంబాలు సొంతింటి కలను సాకారం చేసుకోవడం ఎంతో సంతోషకరమని తెలిపారు. గ్రామ అభివృద్ధికి మౌలిక సదుపాయాలు కీలకమని పేర్కొన్న ఆయన, రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి అవసరాలను దశల వారీగా గ్రామానికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించే విధంగా తన కార్యాచరణ కొనసాగుతుందని అన్నారు.



కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గీతా నరసింహ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవంతో శ్రీపురం గ్రామంలో పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## నేడు హజ్రత్ ఖాజా సయ్యద్ సుల్తాన్ అలీషా బుఖారి ఉర్సు ఉత్సవాలు ప్రారంభం..






నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 19 **ఆకాంక్ష** : నగరంలోని బోయిగూడ కమాన్ ప్రాంతంలో ఉన్న హజ్రత్ ఖాజా సయ్యద్ సుల్తాన్ అలీషా బుఖారి రహమతుల్లా అలే దర్గా వద్ద వార్షిక ఉర్సు ఉత్సవాలు నేడు భక్తి శ్రద్ధలతో ప్రారంభం కానున్నాయి. శుక్రవారం రాత్రి గంధం ఉత్సవంతో ఉర్సు వేడుకలు ఆరంభమవుతాయని భక్త బృందం సభ్యులు తెలిపారు. దర్గా హజరత్ హోరుని జానషీన్ ఖలీఫా ఏ దుల్హె పాషా దర్గా ముతవల్లి, సజ్జా దే నషీన్ హజరత్ సయ్యద్ షా ఖాజా నిజాముద్దీన్ హోరుని ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడనున్నాయి. గంధం ఉత్సవంతో పాటు ఉర్సు సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఫిబ్రవరి 20వ తేదీన గంధోత్సవం, 21వ తేదీన చిరాగా, 22వ తేదీన ఖురాన్ ఖానీ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. గంధోత్సవం రోజున సాయంత్రం ఐదు గంటల నుంచి ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభమై ఖవ్వాలి, గంధం సమర్పణ, ప్రార్థనలు మరియు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఉత్సవాల్లో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని దర్గా నిర్వాహకులు కోరారు.

## దేవాలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తాం...

ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్ రెడ్డి...



నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 19 **ఆకాంక్ష** : నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో వెలసిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించిన శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కుచుకుల రాజేశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని, వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తరపున గతంలోనే నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందించడమే కాకుండా, గ్రామ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు, భక్తులు కోరుకునే సదుపాయాలను దశలవారీగా కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, గ్రామ సర్పంచ్ తుకారాం రెడ్డి, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## తిమ్మాజిపేటలో శివాజీ జయంతి సందర్భంగా 43 యూనిట్ల రక్తదానం...



నాగర్ కర్నూల్/ఫిబ్రవరి 19 **ఆకాంక్ష** : నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల కేంద్రంలో శివాజీ జయంతి సందర్భంగా శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. తిమ్మాజిపేట శివాజీ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో యువజన సంఘ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని మొత్తం 43 యూనిట్ల రక్తాన్ని సేకరించి ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు. శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కే. కవిత, శివాజీ యువజన సంఘం అధ్యక్షుడు బాలకృష్ణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ, సమాజానికి శివాజీ మహారాజ్ చేసిన సేవలు యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తి దాయకమని, ఆయన ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. యువజన సభ్యులు ఇచ్చిన 43 యూనిట్ల రక్తాన్ని నాగర్ కర్నూల్ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌కు ప్రత్యేక అంబులెన్స్ ద్వారా తరలించారు. సేకరించిన రక్తాన్ని అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు ఉచితంగా అందజేస్తామని బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ ఏ. రోహిత్ తెలిపారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ స్వామి, శివాజీ యువజన సంఘ సభ్యులు మల్లేష్, శివ, రఘు, శ్రీశైలం, గ్రామస్థులు లక్ష్మీనారాయణ, వేణుగోపాల్ గౌడ్, మాధవులు, ప్రదీప్, రామ్మోహన్, లింగం, బద్రీనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్లు రాము, దత్తాత్రేయులు, నర్సింగ్ అధికారులు రామాంజనేయులు, హరికృష్ణ, సిబ్బంది రామకృష్ణతో పాటు పలువురు యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.